మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 22-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 203 Issue: 203

22 జనవరి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 6:02 తిథి చవితి రా. 2:260 వరకు తరువాత పంచమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం శతభిష మ. 2:15 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం వారియ సా. 5:29 వరకు కరణం వనిజ మ. 2:38 వరకు విష్టి రా. 2:260 వరకు వర్జ్యం రా. 8:52 నుండి రా. 10:28 వరకు దుర్ముహూర్తం ఉ. 10:36 నుండి ఉ. 11:20 వరకు మ. 3:03 నుండి మ. 3:48 వరకు రాహుకాలం మ. 1:51 నుండి మ. 3:14 వరకు యమగండం ఉ. 6:53 నుండి ఉ. 8:16 వరకు గుళికాకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:04 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు ఉ. 7:05 నుండి ఉ. 8:43 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:50 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


# బంగారం రిజర్వ్!



## బంగారం నిల్వకు ప్రధాన కారణాలు

**ద్రవ్యోల్బణం నుండి రక్షణ:** వస్తువుల ధరలు పెరిగి, కరెన్సీ కొనుగోలు శక్తి తగ్గినప్పుడు (ద్రవ్యోల్బణం), బంగారం తన విలువను కాపాడుకుంటుంది.

**విశ్వసనీయత:** ఫియట్ కరెన్సీలు (ప్రభుత్వాలు జారీ చేసే నోట్లు) ఆయా దేశాల ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి ఉంటాయి. కానీ బంగారానికి అంతర్గత విలువ ఉంటుంది, ఏ ప్రభుత్వంపైనా ఇది ఆధారపడదు.

### నిల్వలను గణనీయంగా పెంచుతున్న ఆర్బీఐ

### డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకే

### ఆర్థిక మాంద్యం, అనిశ్చితి అడ్డుకట్ట కోసమే

### భవిష్యత్తులో భారత్‌కు మేలు: నిపుణులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గత కొన్నేళ్లుగా తన బంగారు నిల్వలను గణనీయంగా పెంచుకుంటోంది. ఈ ఏడాది జనవరి నాటికి కూడా ఈ ధోరణి కొనసాగుతుండటానికి ప్రధాన కారణాలు ఏంటి? ఇదివరకెప్పుడూ బంగారం నిల్వలను పెంచుకోని భారత్.. ఈ మధ్య కాలంలో మరీ అంతలా కొనడానికి కారణాలేంటి? అంటే.. ఆర్థిక భద్రత, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలే కారణం అంటున్నారు బిజినెస్ నిపుణులు. ఒకే రకమైన ఆస్తిపై (ముఖ్యంగా అమెరికన్ డాలర్) ఆధారపడటం ప్రమాదకరం. అందుకే తన పెట్టుబడులను డాలర్లు, యూరోలు, పౌండ్లతో పాటు బంగారంలో కూడా ఆర్బీఐ పంపిణీ చేస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు (యుద్ధాలు వంటివి) లేదా ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు, కరెన్సీల విలువ పడిపోవచ్చు. కానీ బంగారం విలువ ఎప్పుడూ స్థిరంగా ఉంటుంది. దీన్ని 'సేఫ్ హెవెన్' అంటారు. ఇప్పుడు రిజర్వ్ బ్యాంక్ అదే పద్ధతిని అవలంబిస్తోంది. దీర్ఘకాలిక పెట్టుబడికి సురక్షితమైన మార్గంగా భావిస్తోంది.

(ఈవార్తలు – బిజినెస్ డెస్క్)

బంగారం కొనుగోళ్లకు, అమెరికన్ డాలర్‌కు మధ్య బలమైన సంబంధం ఉంది. డాలర్ వాడకాన్ని తగ్గించడాన్ని డీ-డాలరైజేషన్ అంటారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత, అమెరికా తన డాలర్ వ్యవస్థను ఉపయోగించి రష్యాపై ఆంక్షలు విధించింది. భవిష్యత్తులో భారత్‌కు కూడా ఇలాంటి పరిస్థితులు ఎదురైతే, డాలర్ నిల్వలు నిరుపయోగం అవుతాయనే ఆందోళనతో ఆర్బీఐ బంగారాన్ని ఎంచుకుంటోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థపై భారం పెరిగినా లేదా వారి ద్రవ్యలోటు ఎక్కువైనా డాలర్ విలువ పడిపోయే అవకాశం ఉంది. ఇది మన విదేశీ నిల్వలను దెబ్బతీస్తుంది. అంతేకాకుండా, అమెరికా ఫెడరల్ తరువాయి 2 వ పేజీలో...

**వివిధ దేశాల వద్ద ఉన్న బంగారం నిల్వలు**

| | | |
|---|---|---|
| 1 | అమెరికా | 8,133 టన్నులు |
| 2 | జర్మనీ | 3,350 టన్నులు |
| 3 | ఇటలీ | 2,452 టన్నులు |
| 4 | ఫ్రాన్స్ | 2,437 టన్నులు |
| 5 | రష్యా | 2,330 టన్నులు |
| 6 | చైనా | 2,304 టన్నులు |
| 7 | స్విట్జర్లాండ్ | 1,040 టన్నులు |
| 8 | భారత్ | 880 టన్నులు |
| 9 | జపాన్ | 846 టన్నులు |
| 10 | టర్కీ | 641 టన్నులు |

(ఐఎంఎఫ్ వద్ద 2,814 టన్నుల బంగారం నిల్వ ఉంది)



## రూపాయి బేజార్

### రికార్డు స్థాయిలో పతనం

### ఒక దశలో 91.74 స్థాయికి

### బంగారం, వెండి దిగుమతుల వల్లే

ముంబై / న్యూఢిల్లీ: అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రలో అత్యంత కనిష్ఠానికి పడిపోయింది. బుధవారం ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠానికి చేరింది. మార్కెట్‌లో నెలకొన్న పలు ప్రతికూల పరిణామాల మధ్య ఒక్కరోజే 77 పైసల మేర విలువను కోల్పోయింది. మంగళవారం 90.97 వద్ద ముగిసిన రూపాయి, బుధవారం ఉదయం 91.05 వద్ద బలహీనంగా -2 వ పేజీలో...



## బంగారం రూ.1,56,600

బంగారం, వెండి.. నువ్వా నేనా.. అన్నట్లుగా సరికొత్త రికార్డులు సృష్టిస్తూనే ఉన్నాయి. ట్రంప్ టారిఫ్ ఉన్మాదానికి తోడు పలు దేశాలపై యుద్ధానికి దిగే చర్యలకు ఉపక్రమించడంతో బంగారం ధర ఎగిసిపడుతోంది.

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,660 |
| వెండి (గ్రాము): | రూ.345 |
| ప్లాటినం (గ్రాము): | రూ.7,178 |



## కేసీఆర్, హరీశ్ భేటీ

### ఫోన్ ట్యాపింగ్ కేసుపై చర్చ!.. కవిత విమర్శలపైనా డిస్కషన్?

గజ్వేల్, జనవరి 21 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీమంత్రి హరీశ్ రావు భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో కేసీఆర్, హరీశ్ రావు సమావేశమయ్యారు. ఇటీవల హరీశ్ రావును ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరి సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకున్నది. సిట్ విచారణ ఎలా సాగింది? విచారణ అధికారులు తరువాయి 2 వ పేజీలో...

## హైదరాబాద్‌కు స్విస్ మాల్

### ప్రపంచంలోనే మొట్టమొదటిది.. దావోస్ వేదికగా రేవంత్ డీల్

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 2026 వేదికగా తెలంగాణ మరో చారిత్రక ఘట్టానికి నాంది పలికింది. హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ అలంకారం తోడవ్వబోతోంది. ప్రపంచంలోనే మొట్టమొదటి స్విస్ మాల్ భాగ్యనగరంలో ఏర్పాటు కానుంది. స్విట్జర్లాండ్‌లోని వాడ్ కౌన్సిల్ చీఫ్ మినిస్టర్ క్రిస్టెల్ లూయిసియర్ బ్రోడార్డ్‌తో సీఎం రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు సఫలమయ్యాయి. భారత్-స్విట్జర్లాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో.. హైదరాబాద్‌లో స్విస్ మాల్ నిర్మించాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు.



దావోస్: ప్రపంచంలోనే ఇలాంటి మాల్ ఇప్పటివరకు ఎక్కడా లేదు. ఈ వినూత్న ప్రతిపాదనకు స్విస్ ప్రతినిధుల బృందం తక్షణమే సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మాల్ కేవలం షాపింగ్‌కే పరిమితం కాకుండా, స్విస్ సంస్కృతి, విద్య, నైపుణ్య శిక్షణకు కేంద్రంగా నిలవనుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. చర్చలు జరిపిన ఇద్దరు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చిల్లి గవ్వ చేతిలో లేకున్నా హాయిగా బతికేయగల ప్లేస్ గ్రీస్‌లో ఉంది. గ్రీస్‌లోని ఎర్మోపోలీ ఈ సదుపాయం ఉంది. అయితే, అందుకోసం అక్కడి వీధుల్లోని జంతువులను ప్రేమగా చూసుకోవాలి.




## ట్రంప్‌తో ఈయూ కటీఫ్

యూరోపియన్ యూనియన్ (ఈయూ), యునైటెడ్ స్టేట్స్ మధ్య వాణిజ్య ఒప్పందం ప్రక్రియను నిలిపేయాలని యూరోపియన్ పార్లమెంట్ నిర్ణయించింది. గ్రీన్‌ల్యాండ్ ను తన ఆధీనంలోకి తీసుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్, ప్రణాళికను వ్యతిరేకించే యూరోపియన్ మిత్రదేశాలపై సుంకాల బెదిరింపులకు నిరసనగా వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.

బ్రస్సెల్స్: ప్రస్తుతం గత జూలైలో స్కాట్లాండ్‌లోని టర్న్‌బెర్రీలో జరిగిన వాణిజ్య ఒప్పందంలో జరిగిన అనేక అమెరికా ఉత్పత్తులపై దిగుమతి పన్నులను తగ్గించడం లేదా-2 వ పేజీలో...



## బనకచర్లపై సూట్!

### తెలంగాణ సర్కారు కీలక నిర్ణయం

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): ఏపీ సర్కారు తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సూట్ వేసేందుకు రాష్ట్రప్రభుత్వం కసరత్తులు ప్రారంభించింది. ఇరిగేషన్ లీగల్ సమస్యలపై న్యాయ సలహాలు తీసుకుంటోంది. డ్రాఫ్ట్ రెడీ అయ్యాక ఏజీతో చర్చించనుంది. అనంతరం సుప్రీం కోర్టులో సూట్ దాఖలు చేయనుంది. అలాగే తరువాయి 2 వ పేజీలో...

## 16 మందికి ఐఏఎస్ హోదా

### గెజిట్ విడుదల చేసిన కేంద్రం

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సర్వీస్ అధికారుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. సుదీర్ఘ కాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 16 మంది అధికారులకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ.. వీరిని తెలంగాణ క్యాడర్‌కు కేటాయిస్తూ రాష్ట్రపతి ఆమోదం లభించింది. రాష్ట్ర చరిత్రలో ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో తరువాయి 2 వ పేజీలో...

## 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

### ఈసీ మార్గదర్శకాల మేరకు ట్రాన్స్‌ఫర్లు

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ, -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

22.1.2026

మేషం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొత్త పనులు చేపట్టి విజయం సాధిస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. నూతన వస్తులాభాలు పొందుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్థులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృషభం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వృత్తి, వ్యాపారాలలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మిధునం: ఆర్థిక పరిస్థితి కొంత గందరగోళంగా ఉంటుంది. నూతన రుణయత్నాలు చేస్తారు. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. దూరపు బంధువులను కలుసుకుంటారు. వృత్తిఅధికమౌతాయి. వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: ఇంటాబయట మానసిక ఒత్తిడులు ఉంటాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి కొంత గందరగోళంగా ఉంటుంది. నూతన రుణయత్నాలు ఫలించవు. చేపట్టిన పనుల్లో తొందరపాటు మంచిది కాదు. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

సింహం: అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. మొండి బాకీలు వసూలు చేసుకోగలుగుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులు అధికారుల అండదండలతో ముందుకు సాగుతారు.

కన్య: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కొన్ని వ్యవహారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక వ్యవహారాలు కొంత నిరాశ పరుస్తాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకపోవడం మంచిది. వృత్తి ఉద్యోగాల్లో స్థానచలన సూచనలు ఉన్నవి.

తుల: సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలు ఆశజనకంగా సాగుతాయి. ఆర్థికంగా అవసరానికి ధన సహాయం లభిస్తుంది.

వృశ్చికం: ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించదు. వృత్తి వ్యాపారాల్లో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి ఒత్తిడులు పెరుగుతుంది. బంధుమిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు.

ధనస్సు: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

కుంభం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. వ్యాపారపరంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేయుట మంచిది. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు ఉంటాయి.

మీనం: నిరుద్యోగులకు నిరాశ తప్పదు. చేపట్టిన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. కొన్ని వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసిరావు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

# బంగారం రిజర్వ్!

మొదటి పేజీ తరువాయి

రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచినప్పుడు లేదా తగ్గించినప్పుడు భారత రూపాయి విలువలో తీవ్రమైన హెచ్చుతగ్గులు వస్తాయి. బంగారు నిల్వలు ఉండటం వల్ల ఈ ప్రభావం నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. అందుకే, ఆర్బీఐ తన వద్ద ఉన్న బంగారాన్ని విదేశాల (ముఖ్యంగా లండన్ బ్యాంకుల) నుండి వెనక్కి రప్పించి, దేశీయంగా ఉన్న తన సొంత ఖజానాల్లో భద్రపరుస్తోంది. ఇది దేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

## బంగారం నిల్వ చేస్తే ఏమవుతుంది?

ఆర్బీఐ వద్ద నిల్వ ఉంచే బంగారం.. దేశ కరెన్సీ విలువకు హామీగా, సంపద నిల్వగా పనిచేస్తుంది. మన దేశం ప్రపంచంలోని అగ్రదేశాల్లో భారత్ కూడా ఒకటి. ఏదైనా సందర్భం వచ్చినప్పుడు ఇతర దేశాల్లో భారతీయ ఆస్తులపై ఆంక్షలు విధించే/స్తంభింపజేసే ప్రమాదం ఉండొచ్చు. అందుకే.. విదేశాల్లో ఉన్న తన బంగారాన్ని భారత్ స్వదేశానికి తీసుకొస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలోనే దాదాపు 64 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించారు. భారతదేశం డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, బంగారం నిల్వలను పెంచుకోవడం వంటి చర్యలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహానికి ఒక కారణం కూడా. డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసే ఏ దేశం లేదా కూటమి పైనైనా 100 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. ప్రపంచ వాణిజ్యంలో, ముఖ్యంగా బ్రిక్స్ కూటమిలో, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలను ఉపయోగించడం లేదా కొత్త బ్రిక్స్ కరెన్సీని సృష్టించడం వంటి చర్చలను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు, ప్రపంచ వేదికపై డాలర్ స్థానానికి ముప్పుగా ఆయన భావించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన విదేశీ మారక నిల్వలను వైవిధ్యపరచడంలో భాగంగా యూఎస్ ట్రెజరీ హోల్డింగ్స్‌ను తగ్గించి, బంగారం కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ఇది డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే వ్యూహంలో భాగం. అంటే.. మరో రకంగా డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేయడమే. ఇది కూడా ట్రంప్‌కు కంటిలో నలుసులా మారింది. అందుకే కస్సుబస్సుమంటున్నారు.




# 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

మొదటి పేజీ తరువాయి

కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈ బదిలీలు చేపట్టింది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎసీసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పనిచేస్తున్న అధికారులను పరిపాలనా పరమైన కారణాలతో పాటు పదోన్నతులపై బదిలీ చేసింది.



# కేసీఆర్, హరీశ్ భేటీ

మొదటి పేజీ తరువాయి

ఏయే ప్రశ్నలు అడిగారు? దానికి హరీశ్ రావు ఏం సమాధానం చెప్పారు? తదితర విషయాల మీద చర్చ జరిగినట్టు సమాచారం. తాజా రాజకీయ పరిణామాలపైనా వీరు చర్చించినట్టు సమాచారం. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిత్యం బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తోంది. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితురాలినేనని ఆమె అంటున్నారు. హరీశ్ రావు, కేటీఆర్ మీద సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ అంశంపై కూడా హరీశ్ రావు, కేసీఆర్ చర్చించినట్టు సమాచారం.



# ట్రంప్‌తో ఈయూ కటీఫ్

మొదటి పేజీ తరువాయి

తొలగించడం గురించి ఈయూ పార్లమెంట్ చర్చిస్తోంది. ఈ ఒప్పందంలో 2020లో మొదట అంగీకరించిన యూఎస్ లాబ్‌స్టర్‌లపై సున్నా దిగుమతి సుంకాన్ని కొనసాగించే అంశం కూడా ఉంది. అయితే, ఈ మార్పులను ఇప్పటికీ ఈయూ పార్లమెంట్, ఈయూ ప్రభుత్వాల ఆమోదం అవసరం. చాలా మంది యూరోపియన్ చట్టసభ సభ్యులు ఈ ఒప్పందం ఈయూకి అన్యాయమని భావిస్తున్నారు. ఈయూ దాని దిగుమతి సుంకాలలో ఎక్కువ భాగాన్ని తగ్గించాల్సి ఉంటుందని, అయితే యూఎస్ ఇప్పటికీ అనేక ఈయూ వస్తువులపై 15 శాతం సుంకాన్ని కొనసాగిస్తున్నట్టు వారు ప్రస్తావిస్తున్నారు. కొన్ని భద్రతా నిబంధనలతో యూరప్ ఈ ఒప్పందాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, అమెరికా నుంచి వచ్చిన కొత్త బెదిరింపులు వారి అభిప్రాయాన్ని మార్చుకునేందుకు వీలు కల్పిస్తున్నాయి. ఈ బెదిరింపుల కారణంగా, ఈయూ ఒప్పందాన్ని పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించింది.

# రూపాయి బేజార్

మొదటి పేజీ తరువాయి

ప్రారంభమైంది. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది. బంగారం, వెండి దిగుమతులు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో భారీగా పతనమైంది. అంతేకాకుండా, అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, అమెరికా గ్రీన్‌లాండ్ స్వాధీనయత్నం తదితర వార్తలు రూపాయిపై ప్రభావం చూపాయి. దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో కొనసాగడమూ రూపాయి విలువను మరింత బలహీనపరిచింది.

## బంగారం రూ.1,56,600

ముంబై: బంగారం, వెండి.. నువ్వా నేనా.. అన్నట్లుగా సరికొత్త రికార్డులు సృష్టిస్తూనే ఉన్నాయి. ట్రంప్ టారిఫ్ ఉన్మాదానికి తోడు పలు దేశాలపై యుద్ధానికి దిగే చర్యలకు ఉపక్రమించడంతో బంగారం ధర ఎగిసిపడుతోంది. అదీకాక, డాలర్‌తో పోల్చితే రూపాయి రికార్డ్ పతనం వల్ల పసిడి ధర మరింత పెరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.6,820 ఎగిసి రూ.1,56,600కి చేరింది. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారం రూ.6,250 పెరిగి రూ.1,43,550గా నమోదైంది. ఇక, కిలో వెండిపై రూ.5,000 పెరిగి రూ.3,45,000కు చేరింది.

# 16 మందికి ఐఏఎస్ హోదా

మొదటి పేజీ తరువాయి

అధికారులకు ఐఏఎస్ హోదా లభించడం ఇదే తొలిసారి కావడం విశేషం. కేంద్రం విడుదల చేసిన గెజిట్ ప్రకారం, మూడు వేర్వేరు సంవత్సరాల కోటా కింద అధికారులను ఎంపిక చేశారు. అయితే ఈ నియామకాలు ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ తుది తీర్పునకు లోబడి ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది.

సెలక్షన్ లిస్ట్ - 2022: డి. మధుసూదన్ నాయక్, ఎం.సత్యవాణి, జె.భవానీ శంకర్, జి.లింగయ్య నాయక్, ఎ. నరసింహా రెడ్డి, యు.రఘురామ్ శర్మ, పి.చంద్రయ్య, జి.ముకుంద రెడ్డి, ఎ.భాస్కర్ రావు, జి. వీరారెడ్డి, జి.వీ. శ్యామ్ ప్రసాద్ లాల్.

సెలక్షన్ లిస్ట్ - 2023: అబ్దుల్ హమీద్, బి.వెంకటేశ్వర్లు, వై.వి.గణేష్.

సెలక్షన్ లిస్ట్ - 2024: ఎన్.ఖీమ్యా నాయక్, కె.గంగాధర్.



# బనకచర్లపై సూట్!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో చేపడుతున్న సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్వోసీ తీసుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. త్వరలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరపనుంది. ఈ విషయాన్ని స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కాగా ఇప్పటికే పోలవరం-నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుపైనా తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను వెనక్కి సైతం తీసుకుంది. సివిల్ సూట్ రూపంలో మళ్లీ దాఖలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో బనకచర్లపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టుపైనా సూట్ వేయాలని నిర్ణయించుకుంది.



# హైదరాబాద్‌కు స్విస్ మాల్

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, క్రిస్టెల్ లూయిసియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు కావటం. క్రీడారంగంలో భాగస్వామ్యంపై వీరిద్దరూ ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యంగా ఫుట్‌బాల్ శిక్షణ, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనలో స్విస్ సహకారాన్ని సీఎం రేవంత్ కోరారు. వీటితో పాటుగా.. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు స్విస్ సంస్థలు ముందుకు వచ్చాయి. తెలంగాణలోని స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా సాధికారతను పెంపొందించేందుకు స్విస్ బృందం ఆసక్తి చూపింది. రీటైల్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఉత్తమ విధానాలను ఇరు దేశాలు పంచుకోనున్నాయి. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని గ్లోబల్ రీటైల్ హబ్‌గా మార్చేందుకు ఈ స్విస్ మాల్ దోహదపడనుందని సీఎం రేవంత్ తెలిపారు. వాడ్ ప్రాంత పరిశ్రమల శాఖ మంత్రి ఇసాబెల్లె మోరెట్ మాట్లాడుతూ.. త్వరలోనే స్విస్ బృందం హైదరాబాద్‌లో పర్యటించి.. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. అటు గ్లామర్ రంగంలో దిగ్గజమైన లోరియల్, క్లీన్ ఎనర్జీ రంగంలో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థలు తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు దావోస్‌లో ఆయా సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం ఒప్పందాలు చేసుకుంది.

# జీవన్ రెడ్డి బాయ్‌కాట్

### గాంధీభవన్ సమీక్ష నుంచి మధ్యలోనే బయటికి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొనడంపై అభ్యంతరం



నాంపల్లి/హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొనడంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ సమీక్షలో ఎలా పాల్గొంటారని ఆయన ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పక్షాన కొనసాగుతుండడం తెలిసిందే. ఈరోజు గాంధీ భవన్‌లో నియోజకవర్గ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ పాల్గొనడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలోనే జీవన్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ భవన్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు సంజయ్ అఫిడవిట్ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో తాము ఆ పార్టీ నుంచి అవమానాలను ఎదుర్కొన్నామని, అలాంటి పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేను తమ పక్కన కూర్చోబెట్టడం సరికాదని అన్నారు. పదేళ్లు బీఆర్ఎస్‌పై పోరాటం చేశామని, ఇప్పుడు పోరాటం చేసిన వారినే గాంధీ భవన్‌కు రానిస్తే కార్యకర్తలకు ఏమని సమాధానం చెప్పాలని నిలదీశారు. సమీక్ష సమావేశానికి సంజయ్ రావడం జీర్ణించుకోలేక తాను పీసీసీకి క్షమాపణలు చెప్పి గాంధీ భవన్ నుంచి బయటకు వచ్చానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడిన వారిని చులకనగా చూసే పరిస్థితి వస్తుందని తాము ఊహించలేదని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశం పార్టీ విధానానికి, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ ఆలోచనలకు భిన్నంగా జరుగుతోందని అన్నారు. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చేలా ఈ సమీక్ష సమావేశం ఉందని మండిపడ్డారు. నాలుగు దశాబ్దాలుగా తాను పార్టీలో ఉన్నానని, ఎన్నో కష్టాలను భరించానని తెలిపారు. కాంగ్రెస్ తన పార్టీయేనని, కేవలం ఈ రోజు సమీక్ష సమావేశం నుంచి మాత్రమే వెళ్లిపోతున్నానని తెలిపారు.



# 'స్థానిక' ఆడిట్‌లో పారదర్శకత!

### సరళీకృత, ప్రామాణిక ఆడిట్ వ్యవస్థపై చర్చలు.. ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్

హైదరాబాద్, జనవరి 21 : స్థానిక సంస్థల పాలనలో ఆడిట్ పరిధిని, నాణ్యతను, పారదర్శకతను పెంపొందించడంలో సరళీకృత, ప్రామాణిక ఆడిట్ వ్యవస్థల ఆవశ్యకతపై జరిగిన జాతీయ స్థాయి వర్క్‌షాప్ దిగ్విజయంగా ముగిసింది. హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థలో మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి అంతర్గత ఆడిట్ కేంద్రం, స్థానిక నిధుల ఆడిట్ డైరెక్టరేట్లు, రాష్ట్ర ఆడిట్ విభాగాల కోసం అంతర్జాతీయ స్థానిక సంస్థల ఆడిట్ కేంద్రం సహకారంతో ఈ నెల 19 నుంచి బుధవారం వరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ యు.హేమంత కుమార్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. స్థానిక నిధుల ఆడిటింగ్‌లో ఎదురవుతున్న సవాళ్లు, పీఏఐ పరిణతిని అంచనా వేయడం, కాగ్ సాంకేతిక మార్గనిర్దేశం – సహకార యంత్రాంగం వంటి అంశాలపై లోతైన చర్చలు జరిగాయని వివరించారు. ఆడిట్ ప్రణాళిక, రిపోర్టింగ్, స్థానిక సంస్థలతో సమన్వయం వంటి అంశాల్లో అనుభవాలను పంచుకోవడంపై ఈ వర్క్‌షాప్ ప్రధానంగా దృష్టి సారించింది. వివిధ రాష్ట్రాల స్థానిక నిధుల ఆడిట్ డైరెక్టర్లు ఐదు ప్రధాన అంశాలపై బృందాలుగా చర్చించారు. ఇందులో పీఏఐ పరిణతి, వర్చువల్ ఆడిట్ విధానం, గ్రామ పంచాయతీల రిమోట్ ఆడిట్, తనిఖీ నివేదికలు, ఆడిట్ ప్రణాళికల ప్రామాణీకరణ వంటి అంశాలున్నాయి. అలాగే ఐటీ, కృత్రిమ మేధ, కాట్స్ సాధనాలను ఉపయోగించి టీజీఎస్‌ను బలోపేతం చేయడంపైనా చర్చించారు. ఈ ముగింపు సమావేశానికి భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సంజయ మూర్తి, ఎనఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్ర కుమార్, డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మనీశ్ కుమార్, పంచాయతీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్ కుమార్ లోహానీ హాజరయ్యారు. ఐసీఏఎల్ డైరెక్టర్ జనరల్ హెచ్.కె. ధర్మదర్శి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 23 రాష్ట్రాల నుంచి డీఎల్ఎఫ్ఏలు, రాష్ట్ర ఆడిట్ విభాగాలు, ఈఎల్ఎఫ్ఏలకు చెందిన 41 మంది ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్

### అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య విద్య

### ఉస్మానియాలోనైనా, ఆసిఫాబాద్‌లోనైనా ఒకే విద్య

### అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో వైద్య విద్య బోధనను మెరుగుపరిచే దిశగా వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సంప్రదాయ విద్యా విధానంతో పాటు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వైద్య విద్యలో సాంకేతికతను జోడించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించవచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఎడ్యుకేషన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4,140 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో కాలేజీల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యా ప్రమాణాలపై ఎటువంటి రాజీలేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చదివిన వైద్యులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, అదే స్థాయి బోధనను కొత్తగా ఏర్పాటైన జిల్లాల కాలేజీల్లోనూ అందించాలి. ఉస్మానియా విద్యార్థికైనా, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ విద్యార్థికైనా ఒకే రకమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలి. మెడికోలకు కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం చేయకుండా, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించాలి. ఇందుకోసం ప్రతి మెడికల్ కాలేజీలో ప్రాథమిక స్థాయి నుంచే డిజిటల్ మౌళిక వసతులను కల్పించాలి. తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు, ఎలడీ స్క్రీన్లు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకోవాలి. క్లిష్టమైన అనాటమీ, సర్జికల్ ప్రొసీజర్ల పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వర్చువల్ ల్యాబ్స్, సిమ్యులేషన్ టూల్స్, వర్చువల్ రియాలిటీ వంటి అధునాతన పద్ధతులను వినియోగించాలి. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం కళాశాలలను





సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దాలి. ఈ కేంద్రాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి భవిష్యత్ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారించి, వీటిని ఇతర కళాశాలలకు మెంటార్/శిక్షణా కేంద్రాలుగా మార్చాలి. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పాఠ్యాంశాలను డిజిటల్ రూపంలోకి మార్చి, నేషనల్ డిజిటల్ లైబ్రరీతో అనుసంధానం చేయాలి. బోధనాసుపత్రుల్లోని రద్దీ దృష్ట్యా, విద్యార్థులకు క్లినికల్ కేస్ స్టడీలను వివరించేందుకు టెలీమెడిసిన్ విధానాన్ని వినియోగించుకోవాలి. ప్రతి కళాశాలలో అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌తో పాటు ఐటీ అడ్మినిస్ట్రేటర్లు, టెక్నీషియన్లను నియమించాలి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు జరగాలి. విద్యార్థుల హాజరు, పనితీరును ఏఐ టూల్స్ ద్వారా నిరంతరం విశ్లేషించాలి. న వైద్య విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా రాణించేలా వారిని తీర్చిదిద్దడమే ఈ డిజిటల్ విధానం ప్రధాన ఉద్దేశం' అని మంత్రి పునరుద్ఘాటించారు.




# ఓయూలో ఘనంగా ముచ్చర్ల జయంతి వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 21 (ఈవార్తలు): ప్రత్యేక తెలంగాణ తొలిదశ, మలీదశ, తుది దశ ఉద్యమకారుడు, 1952 ముల్కీ ఉద్యమకారుడు, ముచ్చర్ల (సంఘం రెడ్డి) సత్యనారాయణ యాదవ్ జయంతి వేడకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఓయూలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు, కడారి రమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో.. ఈ కార్యక్రమంలో బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జంపాల రాజేశ్, పొలిటికల్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు వలిగొండ నరసింహ, సీనియర్ నాయకులు నోముల శేషు, నోముల వంశీ, విద్యార్థి నాయకులు ఆవుల శ్రీధర్ యాదవ్, సురేశ్, మహేశ్ కుమార్ గౌడ్, మనోహరాచారి, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్ యాదవ్ మాట్లాడుతూ ముల్కీ ఉద్యమం మొదలుకొని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు వలన జరిగే పరిణామాలను ముందుగానే గ్రహించి, భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రులు చేసే పెత్తందారి విధానానికి వ్యతిరేకంగా ఉద్యమం చేసిన మొట్టమొదటి వైతాళికుడు సంగం రెడ్డి సత్యనారాయణ యాదవ్ అని అన్నారు.సొంత గ్రామం పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న అస్తిత్వవాది అని, సర్పంచ్‌గా పంచాయతీ సమితి అధ్యక్షుడిగా తదనంతరం 1983 లో టీడీపీ పార్టీలోచేరి, ప్రముఖ స్వతంత్ర సమరయోధులు హయగ్రీవచారిపై గెలిచి, ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించారని గుర్తుచేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించి తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన అత్యుత్తమ వ్యక్తి అని కొనియాడారు. ఇంతటి గొప్ప వ్యక్తికి స్వరాష్ట్రంలో కనీస గుర్తింపు లేకపోవడం, ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతులను జరపకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆయన జయంతిని ధిక్కార దినోత్సవంగా జరపాలని డిమాండ్ చేశారు.

# ఫాలోఅప్ సదస్సు ఉండాలి

### దావోస్ వేదికగా సీఎం రేవంత్ ప్రతిపాదన



దావోస్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక ప్రతిపాదన చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును ప్రతి సంవత్సరం తెలంగాణలో నిర్వహించాలని ఆయన సూచించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్ నగరంలో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల సమావేశమయ్యారు. హైదరాబాద్ లో బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# కవిత ఆరోపణలకు సమాధానమేది?

### బీఆర్ఎస్ నేతలకు పొన్నం నిలదీత

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఎంతో అవినీతి జరిగిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కవిత లేవనెత్తిన ప్రశ్నలకు, ఆమె చేసిన ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 30 శాతం అధిక కేటాయింపులతో టెండర్లను అప్పగించిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టులు పొందిన వ్యక్తులు ఇప్పుడు వారికి చెడ్డవారయ్యారా అని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీపై కూడా బీఆర్ఎస్ నాయకులు ఇలాగే ఆరోపణలు చేశారని, అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇస్తే బహిష్కరించి వెళ్లిపోయారని ఆయన విమర్శించారు.

# 300 కోట్ల విలువైన పార్కును కాపాడిన హైడ్రా

బాచుపల్లి, జనవరి 21 (ఈవార్తలు): మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో కబ్జాకు గురైన సుమారు రూ. 300 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పార్కు కోసం కేటాయించిన 2.30 ఎకరాల స్థలంతో పాటు, ఎమ్మార్వో కార్యాలయానికి చెందిన 30 గుంటల భూమిని కూడా కబ్జాదారుల చెర నుంచి విడిపించారు. వివరాల్లోకి వెళితే, బాచుపల్లిలోని సర్వే నంబర్లు 142, 143, 144లలో ఉన్న 2.30 ఎకరాల స్థలాన్ని 2016లో అప్పటి జిల్లా కలెక్టర్ పార్కు కోసం కేటాయించారు. అక్కడ మొక్కలు నాటి అర్బన్ నర్సరీని కూడా అభివృద్ధి చేశారు. అయితే, 2023లో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఈ పార్కును ధ్వంసం చేసి, రాత్రికి రాత్రే ప్రహరీ గోడ నిర్మించారు. తమ భూమిగా ప్రచారం చేసుకుంటూ కబ్జాకు పాల్పడ్డారు.

# ఎమ్మెల్యే విజయుడిపై దాడి అమానుషం

### వెంటనే మల్లు రవి క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. విజయుడిపై కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి చేసిన ఈ దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాన్ని భయపెట్టేందుకు, గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారిన రాజకీయానికి పాల్పడుతున్నారనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానిస్తూ శారీరక దాడికి దిగడమనేది... కాంగ్రెస్ ఎంత దిగజారిందో స్పష్టంగా చూపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు గౌరవం లేదని మండిపడ్డారు. ఈ దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎంపీ మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# మేడారంలో కుక్కకు ఎత్తు బంగారం



### క్షమాపణ చెప్పిన సినీ నటి టీనా శ్రావ్య

మేడారం, జనవరి 21 (ఈవార్తలు): మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో యువ నటి టీనా శ్రావ్య తన పెంపుడు కుక్కకు బంగారంతో తులాభారం వేయడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబం సమేతంగా మేడారం వచ్చిన టీనా శ్రావ్య, తన పమేరియన్ జాతికి చెందిన కుక్కకు బంగారం తులాభారం వేశారు. భక్తులు తమ మొక్కులు తీరిన సందర్భంగా సమ్మక్క, సారలమ్మలకు బంగారం సమర్పించడం ఆనవాయతీ. ఇక్కడ బంగారం అంటే బెల్లంను తూకం వేసి సమర్పించడం. సాధారణంగా భక్తులు అమ్మవార్లకు బంగారం సమర్పిస్తుంటారు. అయితే, టీనా శ్రావ్య చేసిన పనిపై విమర్శలు రావడంతో ఆమె స్పందించారు. తన కుక్క అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో కోలుకుంటే అమ్మవార్లకు బంగారం సమర్పిస్తానని మొక్కుకున్నానని ఆమె తెలిపారు. ఆ కారణంగానే ఇలా చేశానని, గిరిజన సంప్రదాయాలను కించపరిచే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని ఆమె స్పష్టం చేశారు.

# నవ్వొస్తోంది!

### కేటీఆర్ సికింద్రాబాద్ జిల్లా డిమాండ్ నవ్వు తెప్పిస్తోంది: కవిత

### నాడు సికింద్రాబాద్ కోసం ఉద్యమిస్తే జైల్లో వేశారని ఆరోపణ



హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విమర్శలు చేశారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవ్ సికింద్రాబాద్ ర్యాలీకి కేటీఆర్ మద్దతు తెలిపారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలన్న కేటీఆర్ డిమాండ్‌పై కవిత స్పందిస్తూ, కేటీఆర్ సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని ఉద్యమిస్తుంటే నాకు నవ్వు వస్తోంది. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయాలని డిమాండ్ చేసిన వారిని పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అణిచివేశారు, జైళ్లలో వేశారు. కానీ, ఇప్పుడు కేటీఆర్ వెళ్లి సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయమని మాట్లాడుతున్నారు అని విమర్శించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేసే విషయమై కవిత మాట్లాడుతూ, జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని, అందుకే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని అన్నారు. అయితే, ఎన్నికల్లో మద్దతు కావాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యువత, మహిళలు కోరితే అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, యువత, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు రాజకీయాల్లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

### గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో రాజకీయ డ్రామా మొదలుపెట్టారని తెలిపారు. గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని... ఫోన్ ట్యాపింగ్ పేరుతో డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలోనే ఎందుకు విచారణ చేపట్టారని ప్రశ్నించారు. ఈ విచారణ తుది దశకు చేరతుందనే నమ్మకం లేదని చెప్పారు. ఈ విచారణ వల్ల తనలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందని తాను భావించడం లేదని అన్నారు. బలహీన వర్గాలకు పొలిటికల్ పవర్ వచ్చినపుడే సమాజం బాగుపడుతుందని కవిత చెప్పారు. యువత, మహిళలు ఎక్కడ పోటీచేసినా జాగృతి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బీసీ వర్గాన్ని మభ్యపెడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో వారికి 42 శాతం వాటా కూడా ఇవ్వకుండానే ప్రభుత్వం ఎన్నికలకు వెళుతోందని విమర్శించారు. సికింద్రాబాద్‌ను జిల్లా చేయాలి అని, అలాగే పీవీ నరసింహారావు పేరు ఏదో ఒక జిల్లాకు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులను పట్టించుకోలేదని కవిత విమర్శించారు. ట్యాంక్‌బండ్‌పై ఆంధ్రావారి విగ్రహాలే ఉన్నాయని... తెలంగాణ మహనీయుల విగ్రహాలు లేవని చెప్పారు. ఆంధ్రవారి విగ్రహాలను తొలగించాలని తాను చెప్పడం లేదని... తెలంగాణవారి విగ్రహాలను కూడా పెట్టాలని చెబుతున్నానని అన్నారు.

# మూసీ వెంట మోడల్ కారిడార్!

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): హైదరాబాదీల ట్రాఫిక్ కష్టాలను తీరుస్తూ మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మూసీ తీరం వెంబడి 120 అడుగుల వెడల్పుతో అత్యాధునిక మోడల్ కారిడార్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అంబర్‌పేట ఎస్టీపీ నుంచి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు సాగే ఈ రహదారి నిర్మాణానికి రూ. 160 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదన గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చకు రానుంది. తొలి దశలో ఉప్పల్ భగాయత్ వరకు: ఈ ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో ఎస్టీపీ నుంచి ఉప్పల్ భగాయత్ డీ–మార్ట్ వరకు 2.7 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నారు. ఈ మార్గంలో రామాంతపూర్ కేసీఆర్ నగర్ వద్ద ఉన్న నాలాపై కొత్తగా బ్రిడ్జిని నిర్మిస్తారు. కేవలం వాహనాల రాకపోకలకే కాకుండా, ఈ రహదారి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లు, సైకిల్ ట్రాక్‌లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్నందున, కొంత మేర ఆస్తుల సేకరణ కూడా అవసరమని అధికారులు భావిస్తున్నారు. వరంగల్ హైవేపై తగ్గనున్న ఒత్తిడి: ప్రస్తుతం గోల్నాక, అంబర్‌పేట, రామాంతపూర్ ప్రజలు సికింద్రాబాద్ లేదా వరంగల్ వైపు వెళ్లాలంటే ఉప్పల్ మెయిన్ రోడ్డుపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ కొత్త 120 అడుగుల రోడ్డు అందుబాటులోకి వస్తే, హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా ఈ రహదారి నగరం రూపురేఖలను మార్చనుంది. మూసీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే విదేశీ నదుల అభివృద్ధి నమూనాలను పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల భవిష్యత్తులో మూసీ నది ఆక్రమణలు కూడా అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# ఒకే టికెట్‌తో బస్సు, మెట్రో, ఎంఎంటీఎస్ జర్నీ

హైదరాబాద్, జనవరి 21 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రణాళికను ప్రారంభించింది. ఎంఎంటీఎస్, మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులను పరస్పరం అనుసంధానిస్తూ సమగ్ర వ్యవస్థను రూపొందిస్తున్నట్లు రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు. ప్రయాణికులకు ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం, రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించడం ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో నిన్న జరిగిన ఉన్నతస్థాయి సమావేశం అనంతరం వికాస్ రాజ్ ఈ వివరాలు వెల్లడించారు. మొత్తం 51 ఎంఎంటీఎస్ స్టేషన్ల పరిసరాల్లో అనుసంధాన రహదారులను విస్తరించాలని జీహెచ్ఎంసీని ఆదేశించినట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ఎంఎంటీఎస్ స్టేషన్ల వివరాలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు జీహెచ్ఎంసీ, ఆర్టీసీతో పంచుకుంటారని తెలిపారు. ఈ సమాచారం ఆధారంగా బస్ స్టాప్‌లను రైల్వే స్టేషన్లకు దగ్గరగా మార్చడంతో పాటు, రద్దీ ప్రాంతాలకు అనుగుణంగా బస్సు రూట్లను పునర్వ్యవస్థీకరిస్తారని వివరించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల నుంచి సమీప కాలనీలకు ప్రయాణికులను చేరవేసేందుకు ప్రైవేట్ ఫీడర్ సర్వీసులను ప్రవేశపెట్టే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.



# మల్యాలలో సీఎం కప్ పోటీలు ప్రారంభం

మల్యాల, జనవరి 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు సర్పంచ్ బొట్ల జయప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆటలతో ఆరోగ్య క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. స్మార్ట్ ఫోన్ యుగంలో క్రీడలపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు

**పల్లెలను అభివృద్ధి చేస్తే తల్లికి సేవచేసినట్లే**

**సర్పంచులకు శిక్షణ కార్యక్రమంలో మంత్రి సీతక్క**



జగిత్యాల టౌన్, జనవరి 21 (ఈవార్తలు): గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అని మంత్రి సీతక్క అన్నారు. నూకపల్లి న్యాక్ సెంటర్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో మూడు విడతలుగా 385 మంది సర్పంచ్ లకు శిక్షణ అందిస్తున్నామని, ఈ నెల 19 నుండి 23 వరకు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు మొదటి విడుత 122 సర్పంచ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడికి ఆహ్వానించినందుకు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్?కు అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయితీ ఎన్నికలలో ఆశలు, ఆశయాలు, లక్ష్యాలు పెట్టుకొని, ఎదురైన ఇబ్బందులను తట్టుకొని ఎన్నికైన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు, గుర్తించిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించే విధంగా పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు. మనం శాశ్వతం కాదు, మన పదవులు శాశ్వతం కాదు, కానీ మనం చేసే పనులు ఎప్పటికీ శాశ్వతం అని ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తు ఉంటాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు చేరుతాయని అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు, పన్నులు ముఖ్యంగా గ్రామాలను అభివృద్ధి పరచాలంటే పాలనాపరంగా ఏం కావాలో ఈ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకోవచ్చని అన్నారు. మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటే మన తల్లికి సేవ చేసినట్లే, మన గ్రామానికి మంచి పని చేస్తే గ్రామ ప్రజలు మనల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు. మనపేరు గ్రామంలో చిరస్థాయిలో నిలిచిపోయే విధంగా అహర్నిశలు పనిచేయాలి. సర్పంచులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ సుపరిపాలన అందించి గ్రామాలను అభివృద్ధి పరుస్తూ రాష్ట్రంలో జగిత్యాల జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభ్యున్నతే మా లక్ష్యం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి.. ధర్మపురిలో 263 కోట్ల పనులకు శంకుస్థాపనలు.. మంత్రులు తుమ్మల, అడ్లూరి, విప్ ఆది హాజరు**



ధర్మపురి, జనవరి 21 (ఈవార్తలు): రాష్ట్రంలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతో పాటుగా అన్ని వర్గాల అభివృద్ధికి మా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. జగిత్యాల జిల్లాలోని పుణ్యక్షేత్రమైన ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి రూ.200 కోట్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి రూ.10 కోట్లు, ఎస్టీపీ ప్లాంటు (శుద్ధ త్రాగు నీటి కేంద్రం) నిర్మాణానికి రూ.17 కోట్లు, ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణానికి రూ.2 కోట్లు, మొత్తంగా 263.40 కోట్ల అంచనాతో 19 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వపరంగా, శాఖ పరంగా, ఆర్థిక శాఖ పరంగా పనులకు అనుమతులు మంజూరు చేస్తే ధర్మపురి శాసనసభ నియోజకవర్గం అభివృద్ధి పనులు జరుగుతాయని నా దృష్టికి తీసుకువచ్చారు. నేను, సీఎం రేవంత్ వెంటనే వాటికి ఆమోదం తెలిపాం' అని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ 'రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక. రైతులు బలంగా ఉంటే రాష్ట్రం బలంగా ఉంటుంది. రైతు కుటుంబాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. ఎరువులు, విత్తనాలు, మద్దతు ధర, సాగునీటి సదుపాయాల కల్పన, మార్కెట్ లింకేజీ అన్న అంశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చూస్తోంది. గతంలో రైతులు ఎదుర్కొన్న అనేక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పంటల భీమా, పంటల నిల్వ, పంటల మార్కెటింగ్ వంటి అంశాల్లో ఆధునిక విధానాలు అమలు చేస్తున్నాం' అని వెల్లడించారు. మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. 'సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. కేవలం పథకాలు ప్రకటించడం కాదు, ఆ పథకాలు లక్ష్యానికి చేరేలా కార్యాచరణ రూపొందించడం మా ప్రాధాన్యం. ప్రత్యేకంగా విద్యారంగంలో పేద, వెనుకబడిన, అగ్రహార ప్రాంతాల విద్యార్థులకు మంచి వాతావరణం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్య ఉండాలి అంటే వసతి, ఆహారం, భద్రత, పఠన వాతావరణం అన్నీ ఉండాలి. అందుకే ఈ జిల్లాలో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించాం' అని వివరించారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టు లు అభివృద్ధి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు అలాగే మా వేములవాడ నియోజకవర్గంలోని మూడు మండలాలు జగిత్యాల జిల్లాలో ఉండడం మూడు మండలాలకు ముఖ్యమైన సుమారు 45000 ఎకరాలకు సాగునీరు అందించే కలికోట సూరారం ప్రాజెక్ట్ భూమి సేకరణ కు ఇప్పటివరకు 44 కోట్ల 50 లక్షల నిధులు మంజూరయ్యాయని మరో 34 కోట్లు రానున్నాయని తెలిపారు కథలాపూర్ మండలానికి సబ్‌స్టేషన్ మంజూరు చేసినందుకు ఉపముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాల్లో ట్రైకార్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్లు బెల్లయ్య నాయక్, తిరుపతి జగిత్యాల, పెద్దపల్లి, రామగుండం, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, విజయ రమణ రావు, మక్కాన్ సింగ్ ఠాగూర్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# ఏపీ మద్యం కేసులో నిందితులకు నిరాశ

**రెగ్యులర్ బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన సుప్రీం**

**ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచన**

న్యూఢిల్లీ: ఏపీ మద్యం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో తీవ్ర నిరాశ ఎదురైంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప తమ డిఫాల్ట్ బెయిల్ ను రెగ్యులర్ బెయిల్ గా మార్చాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు, నిందితులకు రెగ్యులర్ బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది ట్రయల్ కోర్టేనని స్పష్టం చేసిన ధర్మాసనం, నాలుగు వారాల గడువు ఇస్తూ ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. డిఫాల్ట్ బెయిల్ ఇచ్చిన సందర్భంగా విధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరిగాయని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా 'జే బ్రాండ్' పేరుతో ప్రజలను నిలువుదోపిడి చేశారని తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై లోతైన విచారణకు ఆదేశించింది. దీంతో అప్పటి మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు కాగా, పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇప్పటికే కొందరు నిందితులకు బెయిల్ లభించగా, మరికొందరు ఇంకా జైలులోనే ఉన్నారు. ఇంకొందరు నిందితులుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

## కసిరెడ్డి అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

విజయవాడ, జనవరి 21 (ఈవార్తలు): ఏపీ లిక్కర్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజ్ కసిరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. జైల్లో ఉండగానే ఆయనకు స్వల్ప అనారోగ్యం తలెత్తడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఆయన్ను విజయవాడ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)కు తరలించారు. ఆసుపత్రిలో రాజ్ కసిరెడ్డికి వైద్యులు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రాథమికంగా స్వల్ప అస్వస్థత కారణంగానే ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సమాచారం. వైద్య పరీక్షలు పూర్తయ్యాక తిరిగి జైలుకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.



## భూముల మార్కెట్ విలువను పెంచిన ఏపీ

విజయవాడ, జనవరి 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో భూముల మార్కెట్ విలువలను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. సవరించిన భూముల మార్కెట్ విలువలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ మెమో జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది రెండోసారి భూముల మార్కెట్ విలువల పెంపు కావడం గమనార్హం. గత ఏడాది కొత్త జిల్లాలు, వాణిజ్య ప్రాంతాలు, అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం 15 శాతం కంటే ఎక్కువగా పెంచిన విషయం తెలిసిందే. భూముల మార్కెట్ విలువలు పెరగడం వల్ల ప్రభుత్వానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం ద్వారా రూ.13,150 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు ఇది కీలక ఆదాయ వనరుగా మారనుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. ముఖ్యంగా పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. దీంతో భూముల కొనుగోలు, విక్రయాల సమయంలో ఎక్కువ స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, దీర్ఘకాలంలో భూముల ధరలు పెరగడం వల్ల ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంలో ఈ నిర్ణయం కీలకంగా నిలుస్తుందని వారు పేర్కొంటున్నారు.

## వాలంటీర్ వ్యవస్థ మా కొంప ముంచింది

**వైసీపీ ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి వెల్లడి**

మంత్రాలయం, జనవరి 21 (ఈవార్తలు): మంత్రాలయం వైసీపీ ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీలోనే కాకుండా రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలోని వాలంటీర్ వ్యవస్థపై ఆయన బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం పార్టీ శ్రేణులను ఆశ్చర్యానికి గురిచేసింది. వాలంటీర్ వ్యవస్థను పూర్తిగా నమ్ముకోవడం వల్ల ప్రజలు, నాయకుల మధ్య దూరం పెరిగిందని, తాము నేరుగా ప్రజలకు న్యాయం చేయలేకపోయామని ఆయన అంగీకరించారు. "వాలంటీర్ వ్యవస్థ మా కొంప ముంచింది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. వాలంటీర్లపై అధికంగా ఆధారపడటం వల్ల ప్రజల సమస్యలు సకాలంలో తెలుసుకోలేకపోయామని, రాజకీయంగా నష్టపోయామని బాల నాగిరెడ్డి వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చినా, ఈ వాలంటీర్ వ్యవస్థను తిరిగి తీసుకొచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అధినేత జగన్‌పై కూడా ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ జగన్‌కు కార్యకర్తలతో కలవడానికి, ఫొటోలు దిగడానికి సమయం దొరకడం లేదని వ్యాఖ్యానించారు. ఈసారి అయినా కార్యకర్తలను నిరాశపరచకుండా సమయం కేటాయించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తే '2.0 వ్యవస్థ'ను అమలు చేసి, తమను ఇబ్బంది పెట్టిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# అమరావతికి చట్టబద్ధత!

**పార్లమెంట్‌లో బిల్లుకు కేంద్రం సన్నాహాలు... బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే చాన్స్**

న్యూఢిల్లీ/అమరావతి,జనవరి 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లును రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ చర్యతో రాజధానిపై ఉన్న అనిశ్చితికి తెరపడనుంది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగింది. 2024 జూన్ 2తో ఆ గడువు ముగియడంతో, ఏపీకి స్వతంత్ర రాజధానిని అధికారికంగా ప్రకటించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, అమరావతిని రాజధానిగా ఖరారు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి ఒక నివేదిక పంపింది. రాజధాని ఎంపిక ప్రక్రియ, చేపట్టిన నిర్మాణాల వివరాలతో కూడిన నోట్‌ను సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన కేంద్ర హోంశాఖ, దీనిపై తదుపరి చర్యలు ప్రారంభించింది. రాజధాని ఎప్పటి నుంచి అమల్లోకి రావాలో స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, 2024 జూన్ 2 నుంచే వర్తింపజేయాలని రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతిపాదనపై పట్టణాభివృద్ధి, న్యాయ, వ్యవసాయ శాఖలతో పాటు నీతి ఆయోగ్ అభిప్రాయాలను కూడా కేంద్ర హోంశాఖ సేకరిస్తోంది. అన్ని శాఖల నుంచి అభిప్రాయాలు అందిన తర్వాత ఈ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పంపనున్నారు. క్యాబినెట్ ఆమోదం లభించగానే, పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సవరణ కోసం బిల్లును ప్రవేశపెడతారు. ఈ చట్టసవరణతో అమరావతికి రాజధానిగా శాశ్వత భద్రత, చట్టపరమైన గుర్తింపు లభిస్తుంది. తద్వారా భూములిచ్చిన రైతులకు, పెట్టుబడిదారులకు భరోసా కలుగుతుందని, రాజధాని నిర్మాణ పనులు వేగవంతమవుతాయని అధికారులు భావిస్తున్నారు.




## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు నో పే: అయ్యన్నపాత్రుడు

అమరావతి, జనవరి 21 (ఈవార్తలు): వైసీపీ ఎమ్మెల్యేలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి హాజరు కాని ఎమ్మెల్యేలకు 'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాకుండా జీతాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన స్పీకర్ల మహాసభలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల పట్ల శాసన వ్యవస్థకు ఉన్న జవాబుదారీతనం అంశంపై అయ్యన్నపాత్రుడు కీలక ప్రసంగం చేశారు. ఎమ్మెల్యేలు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులని, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం వారి ప్రాథమిక బాధ్యత అని స్పీకర్ గుర్తు చేశారు. ప్రజలు నమ్మకంతో ఎన్నుకుని పంపిన ప్రతినిధులు సభకు రాకుండా జీతాలు తీసుకోవడం సరికాదని స్పష్టంగా చెప్పారు. శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొన్నప్పుడే ప్రజల సమస్యలు చర్చకు వస్తాయని అన్నారు. ఈ అంశంపై లోక్‌సభ స్పీకర్‌తో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అయ్యన్నపాత్రుడు కోరారు. శాసనసభ వ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా మార్చాలంటే ఇలాంటి సంస్కరణలు తప్పనిసరిగా అవసరమని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేల హాజరు తప్పనిసరిగా ఉండేలా 'నో వర్క్.. నో పే' విధానం అమలైతే, శాసనసభ పనితీరు మెరుగుపడుతుందని, ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని స్పీకర్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# దమ్ముంటే చర్చకు రా!

**ఏబీ వెంకటేశ్వరరావుకు బొలిశెట్టి సవాల్**

అమరావతి, జనవరి 21 (ఈవార్తలు): అమరావతి రాజధాని అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేస్తోంది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రారంభమైన ఈ వివాదం, చివరికి బహిరంగ చర్చకు రావాలంటూ సవాళ్లు విసురుకునే వరకు వెళ్లింది. ఇటీవల వైసీపీ అధినేత జగన్ అమరావతిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏబీ వెంకటేశ్వరరావు స్పందిస్తూ, రాజధాని నిర్మాణంలో జాప్యానికి గల కారణాలను వివరించారు. "అమరావతికి పర్యావరణ అనుమతులు రాకుండా అడ్డుకునేందుకు చాలా పిటిషన్లు వేశారు. అందులో బొలిశెట్టి సత్యనారాయణ కూడా ఒకరు. ఆ పెద్దాయనతో సుప్రీంకోర్టు వరకు కేసులు వేయించి, పనులను మూడేళ్లపాటు సాగదీశారు. దీనివల్లే నిర్మాణం పూర్తికాలేదు. ఇప్పుడు మేం నిజాలు చెబుతాం, అబద్ధాలను ఖండిస్తాం" అంటూ ఏబీ వ్యాఖ్యానించారు. ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపణలపై జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ తీవ్రంగా స్పందించారు. ఆయన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను అమరావతి రాజధానికి, రైతులకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలిచానని గుర్తుచేశారు. తాను వేసిన కేసులు కేవలం అమరావతిలోని జరీబు భూములు, వరద ముంపు ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ కోసం మాత్రమేనని, రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కాదని స్పష్టం చేశారు. "వైసీపీ పాలనలో ఏబీ వెంకటేశ్వరరావు కలుగులో దాక్కున్నప్పుడు, నేను జగన్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడాను. అలాంటి నన్ను జగన్ మనిషి అనడం హాస్యాస్పదం. సంస్కారం లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలి" అని బొలిశెట్టి హితవు పలికారు. ఏబీ వెంకటేశ్వరరావు తనపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని బొలిశెట్టి డిమాండ్ చేశారు. "దమ్ముంటే, నా ఆరోపణలపై మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు రావాలి. సమయం, వేదిక మీరే నిర్ణయించండి" అంటూ ఎక్స్ వేదికగా సవాల్ విసిరారు.



# గ్రీన్‌ల్యాండ్ మంచు కింద అమెరికా రహస్య స్థావరం

## నాసా రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తింపు.. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్ కింద నిర్మాణం

న్యూయార్క్: ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా అత్యంత రహస్యంగా నిర్మించిన సైనిక స్థావరం ఒకటి దశాబ్దాల తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చింది. గ్రీన్‌ల్యాండ్ మంచు పొరల కింద కూరుకుపోయిన క్యాంప్ సెంచరీ అనే ఈ బేస్‌ను నాసా శాస్త్రవేత్తలు ఇటీవల రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తించారు. ఇది ఒక సాధారణ శాస్త్రీయ పరిశోధనలో భాగంగా జరిగిన ఆకస్మిక ఆవిష్కరణ కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో, నాసా శాస్త్రవేత్తలు గల్ఫ్‌స్ట్రీమ్ 3 విమానంలో ఉత్తర గ్రీన్‌ల్యాండ్‌పై ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. యూఏవీఎస్‌ఏఆర్ అనే అధునాతన రాడార్ వ్యవస్థను పరీక్షిస్తున్నప్పుడు, పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో మంచు కింద సహజత్వానికి భిన్నంగా, సరళ రేఖల్లో ఉన్న నిర్మాణాలను రాడార్ సిగ్నల్స్ పసిగట్టాయి. చారిత్రక మ్యాపులతో సరిపోల్చగా, అది క్యాంప్ సెంచరీ అని నిర్ధారించుకున్నారు. 1959లో అమెరికా ఆర్మీ ఇంజినీర్లు ఈ బేస్‌ను నిర్మించారు. మంచు కింద నగరం అని పిలిచే ఈ స్థావరం కోసం మంచులో 8 మీటర్ల లోతున సొరంగాలు తవ్వి, పైన మంచుతో కప్పేశారు. సుమారు 200 మంది సిబ్బంది నివసించేలా ల్యాబొరేటరీలు, నివాస గృహాలు నిర్మించారు. దీనికి పోర్టబుల్ న్యూక్లియర్ జనరేటర్‌తో విద్యుత్‌ను అందించేవారు. వాస్తవానికి ఇది ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్ అనే రహస్య ప్రణాళికలో భాగం. సోవియట్ యూనియన్‌ను లక్ష్యంగా చేసుకుని అణు క్షిపణులను ఇక్కడ దాచి ఉంచాలన్నది అమెరికా వ్యూహం. అయితే, మంచు కదలికలు ఊహించిన దానికంటే వేగంగా ఉండటంతో ఈ ప్రాజెక్టు సురక్షితం కాదని భావించి, 1967 నాటికి దీన్ని పూర్తిగా వదిలేశారు. కాలక్రమేణా మంచు పేరుకుపోవడంతో, ప్రస్తుతం ఈ స్థావరం అవశేషాలు సుమారు 30 మీటర్ల (100 అడుగులు) లోతులో కూరుకుపోయి ఉన్నాయి. అణు రియాక్టర్‌ను తొలగించినప్పటికీ, రసాయనిక, జీవ, రేడియోధార్మిక వ్యర్థాలు అక్కడే మిగిలిపోయాయి. వాతావరణ మార్పులతో మంచు కరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఈ వ్యర్థాలు బయటపడి పర్యావరణానికి ముప్పుగా మారవచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అపసవ్య దిశలో యూరప్: ట్రంప్

దావోస్: ఐరోపా సరైన దిశలో పయనించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐరోపాలో వలసలపై సరైన నియంత్రణ లేదని అన్నారు. తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక ఇంజిన్‌గా అమెరికా నిలుస్తోందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వివిధ దేశాలపై సుంకాల విధించడం ద్వారా తమ వాణిజ్య లోటును గణనీయంగా తగ్గించామని ఆయన తెలిపారు. వెనెజువెలాకు ఇప్పుడు సమర్థవంతమైన కొత్త నాయకత్వం లభించిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా తప్ప మరే ఇతర దేశం కూడా సురక్షితంగా ఉంచలేదని ఆయన స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్ కొనుగోలుపై తక్షణమే చర్చలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. డెన్మార్క్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. డెన్మార్క్ కృతజ్ఞత లేని దేశమని ఆయన అభివర్ణించారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత గ్రీన్‌ల్యాండ్‌ను తిరిగి అప్పగించడం అమెరికా చేసిన పొరపాటని ఆయన అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీ చేతిలో ఓడిపోయిన డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేకపోయిందని ఆయన గుర్తు చేశారు. డెన్మార్క్ మరియు గ్రీన్‌లాండ్ ప్రజల పట్ల తమకు ఎంతో గౌరవం ఉందని ఆయన పేర్కొన్నారు.



## జేడీ వాన్స్‌కు మరో బిడ్డ!

నాలుగో బిడ్డకు జన్మనివ్వబోతున్న ఉషా వాన్స్

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, భార్య ఉషా వాన్స్ దంపతులు శుభవార్తను పంచుకున్నారు. త్వరలోనే తమ కుటుంబంలోకి నాలుగో బిడ్డ రాబోతున్నట్టు వారు ప్రకటించారు. ఉష నాలుగో బిడ్డకు జన్మనివ్వబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. జులై చివరి నాటికి పండంటి మగబిడ్డ తమ జీవితాల్లోకి రానున్నాడని తెలిపారు. జేడీ వాన్స్, ఉషా వాన్స్ దంపతులు 2014లో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఈవాన్, వివేక్, మిరాబెల్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# ఫుల్ ట్యాక్స్ వేసుకోండి

## ప్రపంచ కుబేరుల ప్రతిపాదన.. టైమ్ టు విన్ పేరిట బహిరంగ లేఖ

దావోస్: ప్రపంచంలోని 400 సూపర్ రిచ్ (అత్యంత సంపన్నులు) వ్యాపారవేత్తలు ఒక ఆసక్తికరమైన ప్రతిపాదన చేశారు. తమపై అధిక పన్నులు విధించాలని వారు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు ప్రముఖ వ్యాపారవేత్తలు హాజరవుతారు. ఈ నేపథ్యంలో, అక్కడకి వచ్చిన 400 మంది సంపన్నులు తమపై భారీగా పన్ను విధించాలంటూ పిలుపునివ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సూపర్ రిచ్ బృందం టైమ్ టు విన్ పేరిట సంతకాలు చేసిన బహిరంగ లేఖను విడుదల చేసింది. మార్కు రుఫలో, బ్రియాన్ ఎనో, అబిగైల్ డిస్నీ వంటి సూపర్ రిచ్ ఈ మేరకు డిమాండ్ చేస్తూ బహిరంగ లేఖ రాశారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అసమానత్వాలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంపన్నులకు, సామాన్యులకు మధ్య అంతరం నానాటికి పెరుగుతోందని తెలిపారు. ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి సూపర్ రిచ్‌పై అధిక పన్ను విధించాలని వారు పేర్కొన్నారు. సంపన్నులు ప్రజా జీవితాన్ని, రాజకీయ వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరచడమే కాకుండా, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. అత్యంత




సంపన్నులు కొందరు ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారని, ప్రభుత్వాలను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ప్రపంచంలో అసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలను తాము కోరుకుంటున్నామని వారు పేర్కొన్నారు. అధిక పన్నులు విధించడం వల్ల సంపన్నుల జీవన ప్రమాణాలు పడిపోవని గుర్తుంచుకోవాలని అన్నారు. పైగా ఆ నిధులు సామాన్యుల ఆరోగ్యం, విద్య వంటి వాటికి వినియోగించడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. వారు విడుదల చేసిన లేఖ ప్రకారం, ప్రపంచంలోని 1 శాతం సంపన్నుల వద్ద 95 శాతం కంటే ఎక్కువ సంపద ఉంది. జీ20 దేశాలలో నిర్వహించిన ఒక సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సంపన్నులు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారని 77 శాతం మంది భావించగా, కొందరి వద్దే అత్యధిక సంపద ఉండటం ప్రజాస్వామ్యానికి ముప్పుగా 62 శాతం మంది భావిస్తున్నారని సర్వేలో తేలింది.

# యువ సెంటీ మిలియనీర్లలో భారత్ టాప్

**చైనా, యూకేను అధిగమించిన మన యూత్**

**భారత్ నుంచి 201 మంది యువ పారిశ్రామికవేత్తలు**

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తల విషయంలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 40 ఏళ్లలోపు వయసున్న సెంటీమిలియనీర్ల (వంద మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద) జాబితాలో చైనా, యూకే వంటి దేశాలను భారత్ అధిగమించింది. అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్, హురున్ ఇండియా సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో మొత్తం 505 మంది యువ వ్యాపారవేత్తలు ఉండగా, వారిలో 201 మంది భారతీయులే కావడం విశేషం. ఈ నివేదిక ప్రకారం, భారత్ నుంచి 201 మంది, చైనా నుంచి 194 మంది, యూకే నుంచి 110 మంది యువ వ్యాపారవేత్తలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. దేశంలో అత్యధికంగా బెంగళూరు



నుంచి 48 మంది పారిశ్రామికవేత్తలు ఈ జాబితాలో ఉండటంతో, ఆ నగరం ఇండియాస్ యూ40 క్యాపిటల్గా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. 36 నుంచి 40 ఏళ్ల వయసు ఉండి, తొలితరం పారిశ్రామికవేత్తలకు కనీసం 100 మిలియన్ డాలర్లు, వారసత్వ వ్యాపారవేత్తలకు 200 మిలియన్ డాలర్ల వ్యాపార విలువ ఉన్న వారిని ఈ జాబితా కోసం పరిగణనలోకి తీసుకున్నారు. భారత్‌లో పెరుగుతున్న వ్యవస్థాపక స్ఫూర్తికి అద్దం పట్టేలా, జాబితాలోని భారతీయ పారిశ్రామికవేత్తలలో 83 శాతం మంది తొలితరం వారేనని నివేదిక పేర్కొంది. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, సేవల రంగం నుంచి అత్యధికంగా 40 మంది ఉండగా, ఆ తర్వాత హెల్త్‌కేర్ (18), రవాణా (16), ఆర్థిక సేవల (15) రంగాల వారు ఉన్నారు. ఈ యువ పారిశ్రామికవేత్తల సంస్థల మొత్తం విలువ 357 బిలియన్ డాలర్లు కాగా, ఇవి 4.43 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి.

ఈ తరం పారిశ్రామికవేత్తలు ఇప్పటికే దేశ జీడీపీ, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నారు అని అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ అండ్ సీఈవో అపూర్వ సాహిజ్వానీ తెలిపారు. విద్యాసంస్థల పరంగా చూస్తే, ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి 15 మంది పూర్వ విద్యార్థులు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. మహిళా ప్రాతినిధ్యంలో మాత్రం చైనా (29) ముందుండగా, భారత్ నుంచి 15 మంది మహిళలు ఉన్నారు.

## పథకాన్ని పొడగిస్తూ కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ: అసంఘటిత రంగంలోని కోట్లాది మంది కార్మికులకు వృద్ధాప్య భద్రత కల్పిస్తున్న అటల్ పెన్షన్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు కొనసాగించేందుకు ఆమోదం తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు, ప్రచార కార్యక్రమాలకు అవసరమైన నిధుల మద్దతును కూడా కొనసాగించాలని కేబినెట్ నిర్ణయించింది. అసంఘటిత రంగ కార్మికులకు

# 2031 వరకు అటల్ పెన్షన్ యోజన

వృద్ధాప్యంలో ఆదాయ భద్రత కల్పించే లక్ష్యంతో 2015 మే 9న ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇందులో చేరిన వారు చెల్లించే చందాను బట్టి, 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.1,000 నుంచి రూ.5,000 వరకు కనీస గ్యారెంటీ పెన్షన్ లభిస్తుంది. ఈ పథకం ద్వారా దేశంలో పెన్షన్ తీసుకునే వారి సంఖ్యను పెంచడం, ఆర్థిక చేరికను ప్రోత్సహించడం, వికసిత భారత్ ఏ2047 లక్ష్య సాధనకు తోడ్పడటం ప్రభుత్వ ఉద్దేశమని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 19 నాటికి ఈ పథకంలో 8.66 కోట్లకు పైగా చందాదారులు చేరారు. ఈ పథకం అమలులో ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తుండగా, మొత్తం నమోదులలో 70.44 శాతం వాటాను అవే కలిగి ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి నాటికి ఈ స్కీమ్‌లో కొత్తగా చేరే వారి సంఖ్య 24 శాతం వృద్ధిని సాధించి, ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



## ట్రూడో, కేటీ పెర్రీ ప్రేమాయణం

**కెమెరాకు చిక్కిన రొమాంటిక్ జంట**

దావోస్: కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో, ప్రముఖ అమెరికన్ పాప్ సింగర్ కేటీ పెర్రీ మధ్య ప్రేమాయణం మరోసారి బహిర్గతమైంది. గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్న ఈ జంట, స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం 2026 సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీరిద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీని స్పష్టం చేసే కొన్ని దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. ఈ సదస్సులో భాగంగా జరిగిన 'గ్లోబల్ సాఫ్ట్ పవర్ సమ్మిట్'లో జస్టిన్ ట్రూడో ప్రసంగిస్తుండగా, కేటీ పెర్రీ అనూహ్యంగా 'ఫీమేల్ కోషెంట్ లాంజ్'లోకి ప్రవేశించి ఆయనకు తన మద్దతు తెలిపారు. ట్రూడో వేదికపై నుంచి ప్రసంగిస్తూ కేటీ పెర్రీని చూసి కన్నుగీటారు. ప్రతిగా ఆమె కూడా నవ్వుతూ ఆయనకు సైగ చేయడం అక్కడి కెమెరాల్లో రికార్డయింది. ప్రపంచవ్యాప్తంగా పలువురు నేతలు, పారిశ్రామికవేత్తలు హాజరైన ఈ వేదికపై వీరిద్దరి మధ్య జరిగిన ఈ రొమాంటిక్ మూమెంట్ అందరి దృష్టిని ఆకర్షించింది. గత కొన్ని రోజులుగా ఈ జంట బయట కనిపిస్తూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు దావోస్ వేదికగా వీరి బంధం మరోసారి వార్తల్లో నిలిచింది. ప్రస్తుతం ఈ రొమాంటిక్ జంటకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## స్టాక్ మార్కెట్లు కుదేల్

ముంబై: అంతర్జాతీయంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిశాయి. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమ్మకాల ఒత్తిడి అధికంగా కనిపించింది. బీఎస సెన్సెక్స్ 270.84 పాయింట్లు క్షీణించి 81,909.63 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎనస నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయి 25,157.5 వద్ద ముగిసింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, ఇది వరుసగా నాలుగో బలహీనమైన ముగింపు. నిఫ్టీకి 25,130 కీలక మద్దతు స్థాయి అని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 24,920--24,900 స్థాయిల వరకు పడిపోయే ప్రమాదం ఉందని వారు అంచనా వేస్తున్నారు. అయితే, ఇది ట్రెండ్ రివర్సల్ కాదని, మార్కెట్లలో కన్సాలిడేషన్ మాత్రమేనని అభిప్రాయపడ్డారు. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ కెమికల్ ఇండెక్స్ 2.12 శాతం, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.66 శాతం, నిఫ్టీ బ్యాంక్ 1.02 శాతం చొప్పున నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌డటీ వంటి హెవీవెయిట్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. మరోవైపు, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, ఇండిగో వంటి షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు భారీ పతనం నుంచి కొంత కోలుకున్నాయి. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా బలహీనపడింది. యూరప్, గ్రీన్‌లాండ్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా టారిఫ్ చర్యలపై ఆందోళనలతో రూపాయి 0.70 శాతం తగ్గి 91.60 వద్ద ట్రేడ్ అయింది. బంగారం ధరలు పెరగడం కూడా రూపాయిపై అదనపు భారం మోపింది. సమీప భవిష్యత్తులో రూపాయి 90.90 నుంచి 92 మధ్య కదలాడవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

## 100 ఏళ్లుగా హిందూత్వంపై దాడి

**ఉదయనిధి స్టాలిన్‌ను తప్పుపట్టిన మద్రాస్ హైకోర్టు**

చెన్నై: సనాతన ధర్మంపై తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను మద్రాస్ హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. సనాతన ధర్మంపై సోషల్ మీడియాలో ఉదయనిధి చేసిన పోస్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఉదయనిధి ఉపయోగించిన భాష జాతి విధ్వంసాన్ని సూచించేలా ఉందని, ఇది సాధారణ వ్యాఖ్య కాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ వ్యాఖ్యలు ద్వేషపూరిత ప్రసంగానికి సమానమని స్పష్టం చేసింది. సనాతన ధర్మాన్ని ఒక మతంగా పరిగణిస్తే, ఆ మతాన్ని అనుసరించే వారు ఉండకూడదని చెప్పడం మతహత్యకు పిలుపునిచ్చినట్లే అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంటే అది కేవలం అభిప్రాయం కాదని, మతాన్ని, సంస్కృతిని నాశనం చేసే పిలుపుగా మారుతుందని కోర్టు పేర్కొంది. సోషల్ మీడియాలో వాడిన పదాలు స్పష్టంగా జాతి నిర్మూలన, సాంస్కృతిక విధ్వంసాన్ని సూచిస్తున్నాయని కోర్టు అభిప్రాయపడింది. ఉదయనిధి వ్యాఖ్యలను విమర్శించినందుకు బీజేపీ నేత అమిత్ మాలవీయపై నమోదు చేసిన ఎఫఆర్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. మంత్రి వ్యాఖ్యలకు ప్రతిస్పందించడం తప్పు కాదని కోర్టు స్పష్టం చేసింది. ఆయనపై ఎఫఆర్ నమోదు చేయడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## ఫేక్ వీడియోలను నమ్మొద్దు: సుధామూర్తి

న్యూఢిల్లీ: ప్రముఖ రచయిత్రి, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో చలామణి అవుతున్న నకిలీ వీడియోలపై ప్రజలను హెచ్చరించారు. ఆర్థిక పథకాల్లో పెట్టుబడులు పెట్టాలని ప్రోత్సహిస్తున్నట్లుగా ఉన్న ఈ వీడియోలు పూర్తిగా డీప్‌ఫేక్ టెక్నాలజీతో సృష్టించినవని, వాటిని నమ్మి మోసపోవద్దని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో నా ఫొటో, వాయిస్‌ను ఉపయోగించి నకిలీ వీడియోలను ప్రచారం చేస్తున్నారు. నా అనుమతి లేకుండా వీటిని సృష్టించారు. ఈ వీడియోలను ఆధారంగా చేసుకుని ఎవరూ ఎలాంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకోవద్దు అని సుధామూర్తి విజ్ఞప్తి చేశారు. తాను ఎప్పుడూ, ఎక్కడా పెట్టుబడుల గురించి మాట్లాడలేదని ఆమె పునరుద్ఘాటించారు. ఇటీవల ఇలాంటి డీప్‌ఫేక్ వీడియోలను నమ్మి బెంగళూరుకు చెందిన ఓ చార్టర్డ్ అకౌంటెంట్ ఏకంగా రూ. 23.20 లక్షలు కోల్పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై జనవరి 13న బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సుధామూర్తి మరోసారి ప్రజలను అప్రమత్తం చేశారు. ఏదైనా సమాచారాన్ని అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవాలని, ఇలాంటి మోసపూరిత కంటెంట్ కనిపిస్తే వెంటనే సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు రిపోర్ట్ చేయాలని ఆమె సూచించారు. అందరూ అప్రమత్తంగా ఉండి, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కవద్దని ఆమె కోరారు.

## ప్రధాని తర్వాత గంభీర్ ఉద్యోగమే టఫ్

**కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీ కామెంట్స్**




నాగ్‌పూర్: కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్.. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి తర్వాత భారతదేశంలో అత్యంత కష్టమైన ఉద్యోగం గంభీర్‌దేనని ఆయన అభివర్ణించారు. బుధవారం నాగ్‌పూర్‌లో తన పాత మిత్రుడైన గంభీర్‌తో సమావేశమైన అనంతరం థరూర్ ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. గంభీర్‌తో స్నేహపూర్వకంగా, ఫ్రాంక్‌గా చర్చ జరిగిందని థరూర్ తెలిపారు. ప్రతిరోజూ లక్షలాది మంది ఆయన నిర్ణయాలను విమర్శిస్తున్నా, గంభీర్ ఎంతో ప్రశాంతంగా, మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నాడు. అతడి నిశ్శబ్ద సంకల్పానికి, సమర్థవంతమైన నాయకత్వానికి నా అభినందనలు అని తన పోస్టులో పేర్కొన్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో గంభీర్‌కు థరూర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు నుంచి ఆయనకు అంతా మంచే జరగాలని ఆశిస్తున్నట్లు పేర్కొంటూ, ఇండియా/న్యూజిల్యాండ్20 అనే హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. ఈ సందర్భంగా తామిద్దరి సెల్ఫీని కూడా థరూర్ పంచుకున్నారు.





## సినిమా టికెట్ల రేట్ల పెంపు కష్టమే!

తెలంగాణలో సినిమా టికెట్ రేట్ల పెంపు, ప్రత్యేక షోలకు అనుమతి విషయంలో హైకోర్టు ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలు టాలీవుడ్ నిర్మాతలకు తలనొప్పిగా మారాయి. సినిమా విడుదలకు కనీసం 90 రోజుల ముందే టికెట్ హైక్ కోసం దరఖాస్తు చేసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఆ నిబంధన కచ్చితంగా అమలు చేస్తే రాబోయే చాలా సినిమాల విడుదల ప్రణాళికలు పూర్తిగా మారే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటి వరకు తెలంగాణలో సినిమాల విడుదలకు ముందు చివరి దశలో కూడా అనుమతులు తీసుకునే అవకాశం ఉండేది. కానీ తాజా ఆదేశాలతో ఆ సడలింపు ఇక ఉండదని తెలుస్తోంది. విడుదల తేదీ ఖరారు చేసిన వెంటనే మూడు నెలల ముందే ప్రభుత్వ అనుమతుల ప్రక్రియ మొదలు పెట్టాల్సి ఉంటుంది. అయితే వాస్తవ పరిస్థితుల్లో చాలా సినిమాల విడుదల తేదీలు ఒక నెల ముందు మాత్రమే ఖరారవుతుంటాయి. షూటింగ్ ఆలస్యం కావడం, వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి కాకపోవడం, ఇతర పెద్ద సినిమాలతో క్లాష్ నివారించడానికి తేదీలు మార్పు చేయడం వంటి కారణాలతో చివరి నిమిషంలో షెడ్యూల్ మారుతుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో 90 రోజుల ముందే అనుమతులు కోరడం కష్టమని నిర్మాతలు చెబుతున్నారు. అయితే వేసవి



సీజన్ లో విడుదల కావాల్సిన పెద్ద సినిమాలపై ఆ నిబంధన ప్రభావం ఎక్కువగా పడనుంది. చిరంజీవి నటిస్తున్న విశ్వంభర, పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్, రామ్ చరణ్ పెద్ది, నాని ది ప్యారడైజ్, నాగ చైతన్య వృష కర్మ, అడవి శేష్ డెకాయిట్, వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు, సాయి ధరమ్ తేజ్ సంబరాల ఏటి గట్టు, నిఖిల్ స్వయంభూ, అఖిల్ లెనిన్, శర్వానంద్ బైకర్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ టైసన్ నాయుడు వంటి చిత్రాలు వేసవిలో రావొచ్చని ప్రచారం ఉంది. అయితే వీటి విడుదల తేదీలు ఇప్పటికీ ఖరారు కాలేదు. ఇప్పుడు ఆ సినిమాలన్నీ కొత్త నిబంధనల ప్రకారం ముందుగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. లేకపోతే టికెట్ రేట్ల పెంపు, ప్రత్యేక షోలకు అనుమతి లభించకపోవచ్చు. దీంతో విడుదల తేదీలు మారే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఇప్పటికే పెద్ద బడ్జెట్ సినిమాలకు టికెట్ రేట్ల పెంపు కీలక అంశంగా మారింది. మొదటి వారం కలెక్షన్ల మీదే లాభనష్టాలు ఆధారపడుతుండటంతో అనుమతులు రాకపోతే నిర్మాతలకు ఆర్థిక భారం తప్పదని విశ్లేషకులు అంటున్నారు.

## డెకాయిట్‌లో మృణాల్ పార్టు కంప్లీట్!



టాలీవుడ్ హీరో అడివి శేష్ మూవీ డెకాయిట్ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. లేటెస్ట్ గా ఈ సినిమాకు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తన పార్ట్ షూటింగ్‌ను కంప్లీట్ చేసుకుంది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేస్తూ టీమ్ అందరూ కలిసి ఉన్న ఫోటోలను షేర్ చేశారు. శేష్, మృణాల్ కాంబినేషన్ అనగానే ఆడియన్స్‌లో ఒక రకమైన క్యూరియాసిటీ ఉంది. ఎందుకంటే ఇద్దరు కూడా యాక్టింగ్ లో ఆరితేరినవారే. కాబట్టి డ్రామా ఎపిసోడ్స్ మామూలుగా ఉండవని చెప్పవచ్చు. ఇక ఈ హై ఓల్టేజ్ డ్రామా షూటింగ్ రీసెంట్‌గా ఒక ఎగ్జైటింగ్ షెడ్యూల్‌తో ముగిసింది. మృణాల్ తన షూటింగ్ ఫినిష్ చేయడంతో ఇప్పుడు సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరింత స్పీడ్ అందుకోనున్నాయి. సీతారామం సినిమాతో తెలుగు ఆడియన్స్‌కు దగ్గరైన మృణాల్, ఈ సినిమాలో ఎలాంటి రోల్ ప్లే చేస్తోందో చూడాలి. అయితే ఈ సినిమా రిలీజ్ డేట్ గురించి కూడా ఎలాంటి డౌట్స్ కి తావివ్వకుండా మరో క్లారిటీ ఇచ్చారు. డెకాయిట్ సినిమాను ఇదే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఉగాది పండుగ కానుకగా ఈ చిత్రం థియేటర్లలోకి రాబోతోంది. పండుగ సీజన్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా తెలుగు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది.

## పవన్ పీఎం అవుతారేమో



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పొలిటికల్ జర్నీపై హరిహర వీరమల్లు బ్యూటీ నిధి అగర్వాల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత ఏడాది విడుదలైన వీరమల్లు సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయినప్పటికీ, ఆ షూటింగ్ సమయంలో పవన్‌ను దగ్గర నుండి గమనించిన నిధి.. ఆయన వ్యక్తిత్వం గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె పవన్ పొలిటికల్ వ్యక్తిత్వం గురించి తన మనసులో మాట చెప్పారు. పవన్ కళ్యాణ్ ఒక సింహం లాంటివారని, ఆయన చాలా ధైర్యవంతుడని కొనియాడారు. ఎవరికీ లేనంత తెగింపు ఆయన సొంతమని, ఏదైనా సమస్య వస్తే ఒంటరిగా పోరాడగల సత్తా ఆయనకు ఉందని ఆమె పేర్కొన్నారు. పవన్‌ను ఒక పవర్ ఫుల్ లీడర్‌గా చూస్తున్న నిధి, ఆయనలో ఉన్న ఆ ధైర్యమే ఆయన్ని ఈరోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని వెల్లడించారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ భవిష్యత్తులో మన దేశానికి ప్రధానమంత్రి అయినా తాను అస్సలు ఆశ్చర్యపోనని నిధి అగర్వాల్ ఒక షాకింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఆయన ఎప్పటికైనా పీఎం రేంజ్ కు వెళ్తారని ఆమె బలంగా నమ్ముతున్నారు. ఎందుకంటే ఆయన ఇప్పటికిప్పుడు రాజకీయాల్లోకి రాలేదని, చాలా కాలంగా గ్రౌండ్ లెవల్ లో ఎంతో కష్టపడుతున్నారని ఆమె గుర్తుచేశారు.



## సౌత్‌పై శోభిత ఫోకస్

నటి శోభితా ధూళిపాళ్ల గురించి అందరికీ తెలిసిందే. తెలుగమ్మాయే అయినా నేషనల్ వైడ్ గా గుర్తింపు తెచ్చుకున్న అమ్మడు.. హిందీ సినిమాలు, వెబ్ సిరీసుల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇటీవల అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్యను వివాహం చేసుకున్న తర్వాత కొద్ది కాలం గ్యాప్ తీసుకున్న ఆమె, ఇప్పుడు మళ్లీ సినిమాలతో బిజీ అవుతున్నారు. ఇప్పుడు తన కెరీర్ ను తెలుగు, తమిళ సినిమాల వైపు మళ్లిస్తున్నట్టు తెలుస్తోంది. మోడలింగ్ తో కెరీర్ మొదలుపెట్టిన శోభిత, ఆ తర్వాత హిందీ సినిమాలు, వెబ్ సిరీసులల్లో అవకాశాలు అందుకున్నారు. ముఖ్యంగా మేడ్ ఇన్ హెవెన్ సిరీస్ ఆమె కెరీర్ కు మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ సిరీస్ లో చేసిన పాత్రతో యూత్ లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తర్వాత ది నైట్ మేనేజర్ లో నటించి మరోసారి మెప్పించారు.




## దేశభక్తిని తట్టిలేపే 'సలాం' పాట

మూడు రంగుల జెండానే.. మూడు మతాలకు ఐక్యతనే.. అంటూ సాగిన గీతం దేశభక్తిని తట్టిలేపుతోంది. అద్భుతమైన లిరిక్స్‌తో ఆద్యంతం సాగే పాట వింటే రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. మోహన్ మర్రిపెల్లి దర్శకత్వం వహించగా దామెర తిరుపతి లిరిక్స్ అందించారు. స్క్రిప్ట్, కాన్సెప్ట్ కూడా ఆయనదే. ఈ పాటను వాశ్విక్ ఫౌండేషన్ నిర్మించింది. యూట్యూబ్‌లో విడుదలైన ఈ పాట రోజురోజుకు వీక్షకుల ఆదరణను పెంచుకుంటోంది. ఈ పాటను వీక్షించేందుకు పైనున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.



## నభా.. అందిరబ్బా!

ఇస్మార్ట్ శంకర్ సినిమాతో ఓవర్ నైట్ లోనే స్టార్ స్టేటస్ ని సొంతం చేసుకున్న నభా నటేష్‌కు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. సోలో బతుకే సో బెటర్, డార్లింగ్, డిస్కో రాజా వంటి చిత్రాలలో నటించిన ఈమె.. ప్రస్తుతం ప్రముఖ హీరో నిఖిల్ సరసన స్వయంభు చిత్రంతోపాటు నాగబంధం అనే సినిమాలో కూడా నటిస్తోంది. ఇప్పటికే ఈ రెండు సినిమాలకు సంబంధించిన ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్లను కూడా విడుదల చేశారు.రెండింటిలో కూడా చాలా అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకున్న ఈమె.. తాజాగా తన ఇన్స్టా వేదికగా ఒక వీడియోని పంచుకుంది. అందులో కొరియోగ్రాఫర్ ఫాల్గుణి తో కలిసి జిమ్ములో అదిరిపోయే స్టెప్స్ తో డాన్స్ ఇరగదీసింది. పొట్టి నిక్కరు వేసుకొని అందాలు కనిపించేలా డాన్స్ చేస్తూ అందరిని ఆకట్టుకుంది.



# కివీస్‌కు అభి'షేక్'

## కాటేరమ్మ చిన్న కొడుకు విధ్వంసం.. 35 బంతుల్లోనే 84 పరుగులు

## తొలి టీ20లో టీమిండియా భారీ విజయం


నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 48 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. 239 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ చివరికి 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (10), ఇషాన్ కిషన్ (8) స్వల్ప స్కోర్లకే ఔటయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అభిషేక్ శర్మ, కేవలం 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 84 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో రింకూ సింగ్ 20 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 44 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడంతో భారత జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. భారీ లక్ష్యఛేదనలో కివీస్ కు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ డెవాన్ కాన్వే (0), రచిన్ రవీంద్ర (1) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. అయితే, గ్లెన్ ఫిలిప్స్ 40 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 78 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అతనికి మార్క్ చాప్‌మన్ (39) జత కలిసినప్పటికీ, భారీ లక్ష్యం ముందు వారి పోరాటం సరిపోలేదు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో కివీస్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 190 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి చెరో రెండు వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.





## గంభీర్‌కు 6 వారాల అగ్ని పరీక్ష!

టీమిండియా ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ ప్రస్థానం ప్రస్తుతం ముళ్ల బాటలా మారింది. గత కొన్ని నెలలుగా వరుస వైఫల్యాలతో అభిమానులు, విమర్శకుల నుంచి ఆయన తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే 6 వారాలు గంభీర్ కోచింగ్ కెరీర్‌ను శాసించబోతున్నట్లు తెలుస్తోంది. గౌతమ్ గంభీర్ తనపై ఉన్న విమర్శలను చెరిపివేసి తన కోచింగ్ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలంటే వచ్చే ఒకటిన్నర



నెలలో రెండు ప్రధాన లక్ష్యాలను చేరుకోవాల్సి ఉంది. కివీస్‌తో జరగనున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ కచ్చితంగా గెలవాలి. టీ20 వరల్డ్ కప్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఉన్న భారత్, ఈ మెగా టోర్నీలో టైటిల్‌ను నిలబెట్టుకోవాలి. గత కొన్ని నెలలుగా భారత జట్టు ప్రదర్శన ఆశాజనకంగా లేదు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా టెస్ట్ క్రికెట్‌లో భారత్ పేలవ ప్రదర్శన చేయడం గంభీర్ వ్యూహాలపై ప్రశ్నలు లేవనెత్తింది.కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 1-2తో కోల్పోవడం గంభీర్‌ను మరింత ఇరకాటంలో పడేసింది. 2027 వన్డే వరల్డ్ కప్ సన్నాహాల్లో భాగంగా వైట్ బాల్ క్రికెట్‌లో ఈ ఓటములు ఆందోళన కలిగిస్తున్నాయి. గంభీర్‌కు అత్యంత పట్టున్న ఫార్మాట్ టీ20 కావడంతో, అభిమానులు ఇంకా ఆశతో ఉన్నారు. జట్టులోకి కీలక ఆటగాళ్ల పునరాగమనం భారత్‌కు బలాన్నిస్తోంది. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులోకి రావడం సానుకూలాంశంగా మారింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో తిలక్ వర్మ, సంజూ శాంసన్ వంటి అటాకింగ్ ప్లేయర్లు ఫామ్‌లో ఉండటం గంభీర్‌కు కలిసొచ్చే అంశం. చివరగా టీ20 వరల్డ్ కప్ ఫలితమే గంభీర్ విధిని నిర్ణయిస్తుంది. భారత్ గనుక ఈ టోర్నీలో విజయం సాధిస్తే, విమర్శకుల నోళ్లు మూయించడంతో పాటు ఏడాది చివరలో జరిగే టెస్ట్ సిరీస్‌లపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. ఒకవేళ విఫలమైతే మాత్రం, బీసీసీఐ కొత్త కోచ్ గురించి ఆలోచించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. గంభీర్ వ్యూహాలు, ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసే ప్రయోగాలు రాబోయే మ్యాచ్‌ల్లో ఎలా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది.



## ఒకే ఒక్కడు.. పాండ్యా

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు కురిపించాడు. హార్దిక్ పాండ్యాలా బంతితో పాటు బ్యాట్‌తో రాణించే ఆటగాడు ఈ ప్రపంచంలోనే లేడని కొనియాడాడు. అతను లేకుంటే టీమిండియా కాంబినేషన్ అసంపూర్ణమని అభిప్రాయపడ్డాడు. 'హార్దిక్ పాండ్యా లేకుంటే టీమిండియా కాంబినేషన్ అసంపూర్ణంగా ఉంటుంది. ఈ ప్రపంచంలోనే హార్దిక్ లాంటి ఆటగాడు మరొకరు లేరు. బ్యాట్‌తో పాటు బంతితో ఈ దేశంలోనే మరెవరూ రాణించలేరు. హార్దిక్ పాండ్యా కొత్త బంతితో బౌలింగ్ చేయగలడు. అలాగే డెత్ ఓవర్లలో కూడా జట్టుకు ఉపయోగపడగలడు. వరుణ్ చక్రవర్తీ లేదా కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులో ఆడించాలనుకుంటే.. అప్పుడు 8వ స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడు కూడా కావాలి. ఇలా అన్ని కావాలంటే కుదరదు. ఎందుకంటే 12 మంది ఆటగాళ్లను ఆడించలేం. కేవలం హార్దిక్ పాండ్యా మాత్రమే ఈ లోటును భర్తీ చేయగలడు. అతను కొత్త బంతితో పాటు డెత్ ఓవర్లలోనూ తన బౌలింగ్‌తో ప్రభావం చూపగలడు. భారత్ గెలిచిన టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లోనూ ఆఖరి ఓవర్‌ను హార్దిక్ పాండ్యానే వేశాడు. హార్దిక్ ఒక్కడే ఇలా చేయగలడు. అతనిలాంటి ఆటగాడు మరెక్కడా దొరకడు. న్యూజిలాండ్‌తో సిరీస్ భారత్‌కు చాలా కీలకం. న్యూజిలాండ్ కూడా పూర్తి సన్నద్ధతతో వచ్చింది. వన్డే సిరీస్‌కు కొందరు ఆటగాళ్లు దూరంగా ఉన్నా.. టీ20 సిరీస్‌లో మాత్రం పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతుంది. వారి ప్రధాన టీ20 ప్రపంచకప్ జట్టు ఆడుతోంది.

## కోల్‌కతా ఫీల్డింగ్ కోచ్‌గా యాగ్నిక్..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ పక్కాగా సిద్ధమవుతోంది. వేలంలో మ్యాచ్ విన్నర్లను కొన్న ఆ ఫ్రాంచైజీ.. కోచింగ్ యూనిట్‌ను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఇప్పటికే బ్యాటింగ్, బౌలింగ్ కోచ్‌లను నియమించుకున్న కోల్‌కతా.. తాజాగా ఫీల్డింగ్ కోచ్‌ను తీసుకుంది. దేశవాళీలో దంచికొట్టిన మాజీ క్రికెటర్ దిశాంత్ యాగ్నిక్ కు బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని బుధవారం ఎక్స్ వేదికగా కోల్‌కతా వెల్లడించింది. దేశవాళీ క్రికెట్‌లో రాజస్థాన్‌కు ఆడిన దిశాంత్ యాగ్నిక్ వికెట్ కీపర్, బ్యాటర్‌గా రాణించాడు. 2004-05లో ఫస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన దిశాంత్.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వీడ్కోలు అనంతరం రాజస్థాన్ జట్టుకు ఏడేళ్లు (2008-2025) ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశాడు. ఐపీఎల్‌లో కోచింగ్ అనుభవమున్న అతడిని ఈసారి కోల్‌కతా పట్టేసింది.



## ఐసీసీ నం.1గా డారిల్ మిచెల్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానాన్ని కోల్పోయాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్.. విరాట్ కోహ్లీని వెనక్కినెట్టి నెంబర్ వన్ ర్యాంక్ అందుకున్నాడు. అతని ఖాతాలో 845 పాయింట్స్ ఉండగా.. విరాట్ కోహ్లీ 795 రేటింగ్ పాయింట్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు. ఇటీవల భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో డారిల్ మిచెల్(84, 131 నాటౌట్, 137) రెండు శతకాలు, ఓ హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. మూడు మ్యాచ్‌ల్లో 176 యావరేజ్‌తో 352 పరుగులు చేశాడు. అతని అసాధారణ ప్రదర్శనతో 38 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్ భారత గడ్డపై వన్డే సిరీస్ గెలిచింది. ఈ సిరీస్‌లో కోహ్లీ ఓ




సెంచరీ(124)తో పాటు (93) హాఫ్ సెంచరీతో రాణించాడు. రెండో వన్డేలో (24) విఫలమయ్యాడు. మొత్తం 80 యావరేజ్‌తో 240 పరుగులు చేశాడు. దాంతోనే టాప్ ర్యాంక్ కోల్పోయాడు. సుదీర్ఘ విరామం తర్వాత నెంబర్ వన్ ర్యాంక్ అందుకున్న కోహ్లీ.. రోజుల వ్యవధిలోనే అగ్రస్థానాన్ని కోల్పోయాడు. మరోవైపు ఈ సిరీస్‌లో దారుణంగా విఫలమైన రోహిత్ శర్మ మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ ఖాతాలో 757 రేటింగ్ పాయింట్స్ ఉన్నాయి. అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ 764 పాయింట్స్‌తో మూడో స్థానంలో నిలిచాడు. కేఎల్ రాహుల్(670 పాయింట్స్) పదో, శ్రేయస్ అయ్యర్(656)11వ స్థానాల్లో కొనసాగుతున్నారు. ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ 908 పాయింట్లతో తొలి స్థానంలో ఉండగా.. తిలక్ వర్మ(805 పాయింట్స్) మూడో స్థానంలో ఉన్నాడు. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 880 పాయింట్లతో ఇంగ్లండ్ బ్యాటర్ జోరూట్ అగ్రస్థానంలో ఉండగా.. యశస్వి జైస్వాల్(750 పాయింట్లు) ఎనిమిదో, శుభ్‌మన్ గిల్(730 పాయింట్స్) పదో స్థానంలో ఉన్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
గురువారం 22-1-2026

# నవ శకం.. భారత్ - ఈయూ బంధం



ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య ఆర్థిక సహకారం అత్యంత ప్రాధాన్యం సంతరించుకోనుంది. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం, అతిపెద్ద వాణిజ్య కూటమి చేతులు కలపబోతుండటం రెండు ప్రాంతాలకే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోయనుంది. అనేక ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత్-ఈయూ మధ్య ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చర్చలు వేగవంతం కావడం శుభపరిణామం. ఈ ఒప్పందం కుదిరితే, భారతీయ వస్త్రాలు, తోలు వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులకు యూరప్ మార్కెట్లో సుంకం లేని ప్రవేశం లభిస్తుంది. అదే సమయంలో, యూరప్ నుంచి అత్యాధునిక సాంకేతికత, యంత్రాలు, పెట్టుబడులు భారత్‌కు తరలివస్తాయి. అయితే, వాణిజ్య బంధంలో కొన్ని కీలక సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా, ఈయూ ప్రవేశపెట్టిన కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం భారతీయ ఎగుమతిదారులపై అదనపు భారం వేసే అవకాశం ఉంది. సమాచార పరిరక్షణ చట్టాల విషయంలో ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం అవసరం. ఔషధ రంగంలో పేటెంట్ నిబంధనలపై స్పష్టత రావాల్సి ఉంది. కేవలం వస్తువుల క్రయవిక్రయాలకే పరిమితం కాకుండా, ఇండియా-ఈయూ ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ద్వారా సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, హరిత ఇంధనం వంటి రంగాలలో ఉమ్మడి పరిశోధనలు సాగుతున్నాయి. ఇది చైనాపై ఆధారపడటాన్ని తగ్గించి, సరఫరా గొలుసును బలోపేతం చేయనుంది. ఇరు పక్షాలు మొండి పట్టుదలకు పోకుండా, పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికన ఒప్పందాలను కుదుర్చుకుంటే, ఇది విన్-విన్ భాగస్వామ్యంగా నిలుస్తుంది. - ఈవార్తలు సంపాదకీయ విభాగం






శశిధర్ అక్కెల

రెండు ప్రపంచ యుద్ధాల భీభత్సాన్ని చూసిన తర్వాత, ప్రపంచం మళ్లీ అటువంటి తప్పు చేయదని అందరూ భావించారు. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు స్థాపించబడింది అందుకే. కానీ, 2026 నాటికి ప్రపంచ పటం వైపు చూస్తే, శాంతి కపోతాలు రక్తం చిందిస్తూ, యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఆధునిక సాంకేతికత మానవుడిని చంద్రుడిపైకి తీసుకెళ్తుంటే, అతడిలోని ఆదిమ కాలపు రాజ్యకాంక్ష మాత్రం మళ్లీ యుద్ధ క్షేత్రం వైపు నడిపిస్తోంది.

నేడు యుద్ధం అనేది కేవలం రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదం కాదు. అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఆహార భద్రతను శాసించే స్థాయికి చేరుకుంది. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభాన్నే చూస్తే.. ఇది కేవలం భూభాగం కోసం జరుగుతున్న పోరాటం కాదు. ఇది నాటో వర్సెస్ రష్యాగా మారి, యూరప్ భద్రతను ప్రశ్నార్థకం చేసింది. మూడేళ్లు దాటినా ఈ యుద్ధం ఆగిపోకపోవడం అంతర్జాతీయ దౌత్య వైఫల్యానికి నిదర్శనం. రెండోది మధ్యప్రాచ్యం (మిడిల్ ఈస్ట్) ఉద్రిక్తతలు. ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలు గల్ఫ్ ప్రాంతాన్ని అస్థిరపరుస్తున్నాయి. ఇరాన్ ప్రమేయం, లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఈ ప్రాంతాన్ని అగ్నిగుండంగా మార్చాయి. తైవాన్ విషయంలో చైనా అనుసరిస్తున్న దూకుడు వైఖరి, అమెరికాతో నేరుగా ఘర్షణకు దారితీసే ప్రమాదం పొంచి ఉంది.

### మరణ హోమానికి పెట్టుబడి

ప్రస్తుతం ప్రపంచ దేశాలు విద్య, వైద్యం కంటే రక్షణ బడ్జెట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అణ్వాయుధ ప్రయోగం ఉండదని భావించినా, నేడు రష్యా, ఉత్తర కొరియా వంటి దేశాల నుండి వస్తున్న హెచ్చరికలు ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. మానవ ప్రమేయం లేకుండానే నిర్ణయాలు తీసుకునే కిల్లర్ రోబోట్స్, డ్రోన్ టెక్నాలజీ యుద్ధాన్ని మరింత ప్రమాదకరంగా మార్చాయి. సైబర్ యుద్ధాలు దేశాల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తున్నాయి. యుద్ధం అంటే కేవలం సైనికుల మరణం కాదు, అది ఒక తరాన్నే నాశనం చేస్తుంది. యుద్ధాల వల్ల కోట్లాది మంది నిరాశ్రయులవుతున్నారు.

### సామాజిక సమతుల్యతకు విఘాతం

యూరప్, ఆసియా దేశాల్లో పెరుగుతున్న శరణార్థుల సంఖ్య సామాజిక సమతుల్యతను దెబ్బతీస్తోంది. అంతేకాకుండా, సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల ఇంధన ధరలు, ఆహార ధాన్యాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఆఫ్రికా దేశాల్లో ఆహార సంక్షోభం తలెత్తడం దీనికి ఉదాహరణ. బాంబు దాడులు, క్షిపణి ప్రయోగాలు పర్యావరణానికి చేస్తున్న నష్టం అపారం. ఇది వాతావరణ మార్పులను మరింత వేగవంతం చేస్తోంది.

### ఐరాస వైఫల్యం

ఐక్యరాజ్యసమితి నేడు ఒక దంతాలు లేని పాములా మారిపోయింది. శక్తివంతమైన దేశాలు తమ ప్రయోజనాల కోసం వీటో అధికారాన్ని వాడుకుంటూ, శాంతి తీర్మానాలను అడ్డుకుంటున్నాయి. అంతర్జాతీయ చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. బలవంతుడిదే రాజ్యమనే అడవి చట్టం మళ్లీ రాజ్యమేలుతోంది. ప్రపంచం రెండు వర్గాలుగా విడిపోతున్న వేళ, భారత్ వసుధైక కుటుంబం అనే నినాదంతో శాంతి కోసం ప్రయత్నిస్తోంది. ఇది యుద్ధాల యుగం కాదు అని భారత ప్రధాని ఇచ్చిన పిలుపు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. రష్యా, అమెరికా వంటి దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండి, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని భారత్ కోరుతోంది. అయితే, మూడవ ప్రపంచ యుద్ధం అంటూ వస్తే, అది రాళ్లతో, రప్పలతో జరగాల్సిన పరిస్థితి వస్తుంది. ఎందుకంటే, అణ్వాయుధ యుద్ధం తర్వాత భూమిపై నాగరికత మిగలదు. శాంతి అనేది ఒక ఎంపిక కాదు, అది ఒక అనివార్యత.

# అదృశ్య శత్రువుతో యుద్ధం

ఒకప్పుడు దొంగతనం అంటే ఇంట్లోకి చొరబడి వస్తువులను ఎత్తుకెళ్లడం. కానీ నేడు, దొంగ మన పక్కనే కూర్చున్నా మనకు తెలియదు. మన జేబులోని ఫోన్ ద్వారా మన బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే సైబర్ నేరగాళ్లు అదృశ్య శత్రువులుగా మారారు. సాంకేతికత పెరిగేకొద్దీ నేరగాళ్ల ఎత్తుగడలు కూడా మారుతున్నాయి. ఏమరుపాటుగా ఉంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్న సంకేతాలివి.





- రణధీర్ గుండు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఒకరి ముఖాన్ని, గొంతును మరొకరిలా మార్చడం నేడు సర్వసాధారణమైంది. మీ బంధువుల గొంతుతో ఫోన్ చేసి అత్యవసరమని డబ్బులు అడిగితే, అది డీప్‌ఫేక్ కావచ్చు. 'మీకు భారీ లాటరీ తగిలింది' లేదా 'మీ విద్యుత్ బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తాం' వంటి సందేశాలతో వచ్చే లింకులను క్లిక్ చేస్తే మీ వ్యక్తిగత సమాచారం చోరీకి గురవుతుంది. తక్షణ రుణం పేరుతో అమాయకులను ఆకర్షించి, వారి ఫోన్ డేటాను సేకరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడటం నేటికీ పెద్ద సమస్యగా ఉంది. ఇలాంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈమెయిల్, సోషల్ మీడియా, బ్యాంకింగ్ యాప్‌లకు తప్పనిసరిగా టూ-స్టెప్ వెరిఫికేషన్ పెట్టుకోవడం, ఓటీపీ లాగిన్ వంటి పద్ధతులు తప్పనిసరిగా ఉపయోగించాలి. వాట్సాప్ లేదా ఎసంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులను ఎప్పుడూ క్లిక్ చేయొద్దు. ముఖ్యంగా బహుమతుల పేరుతో వచ్చే సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. రైల్వే స్టేషన్లు లేదా హోటళ్లలో ఉండే ఉచిత వై-ఫైని ఉపయోగించి బ్యాంకింగ్ లావాదేవీలు చేయకండి. ఇది హ్యాకర్లకు సులభమైన దారి. ఏదైనా యాప్ ఇన్‌స్టాల్ చేసేటప్పుడు అది మీ కాంటాక్ట్స్, గ్యాలరీని అడుగుతుంటే ఆలోచించండి. ఒక కాలిక్యులేటర్ యాప్‌కు మీ కాంటాక్ట్స్ అవసరం ఏముందో గమనించాలి. ఒకవేళ సైబర్ దాడికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించాలి. సైబర్ నేరం జరిగిన మొదటి ఒకటి లేదా రెండు గంటలు అత్యంత కీలకం. వెంటనే స్పందిస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుంది. వెంటనే 1930 అనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి. ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ప్రజల్లో చైతన్యం కచ్చితంగా అవసరం. అదే సమయంలో పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యలో భాగంగా సైబర్ భద్రతను ఒక పాఠంగా చేర్చాలి. బ్యాంకులు, టెలికాం కంపెనీలు తమ భద్రతా వ్యవస్థలను నిరంతరం నవీకరించుకోవాలి.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY BOMMAKANTI SHRAVAN KUMAR, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: BOMMAKANTI SHRAVAN KUMAR, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.